

ఎన్‌సీసీ కేడెట్లకు బి సర్టిఫికెట్ పరీక్ష

ఏలూరు అర్బన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఎన్‌సీసీ కెడెట్లకు 'బి' లెవెల్ సర్టిఫికెట్ పరీక్షలు ఆదివారం స్థానిక సీఆర్ఆర్ పబ్లిక్ స్కూలులో జరిగాయి. జిల్లాలోని పలు పాఠశాలల ఎన్‌సీసీ కేడెట్లకు రాత పరీక్షలను నిర్వహించారు. ఎన్‌సీసీ జిల్లా సీవో కల్నల్ అమిత్‌పాండే అధికారిక కార్యక్రమం నిమిత్తం భోపాల్ వెళ్లడంతో ఆయన తరఫున విజయవాడ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ సంజయ్‌కుమార్ తన్వార్, ఏఎన్‌వోలు, పీఐ సిబ్బంది పర్యవేక్షించారు.





పరీక్షకు వెళుతున్న అభ్యర్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది



గ్రూప్ 2 పరీక్ష ప్రశాంతం

● మొత్తం అభ్యర్థులు 4,415 మంది ● ఉదయం 3,881 మంది, మధ్యాహ్నం 3,878 మంది హాజరు



సీఆర్ఆర్ పరీక్ష కేంద్రం పరిశీలిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి



సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల పరీక్ష కేంద్రం పరిశీలిస్తున్న ఎస్పీ కిశోర్

ఏలూరు అర్బన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలు ఆదివారం జిల్లా కేంద్రంలో ప్రశాంతంగా జరిగాయి. పరీక్ష నిర్వహణపై శనివారం సందిగ్ధత నెలకొన్నా పరీక్ష యధాతథంగా కొనసాగుతుందని ఏపీపీఎస్సీ ఉన్నతాధికారులు స్పష్టం చేయడంతో అభ్యర్థులు ఊపిరి పీల్చుకున్నారు. ఆదివారం ఉదయం 7 గంటల నుంచి వివిధ ప్రాంతాల నుంచి సంబంధిత పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. జిల్లాలో మొత్తం 4415 మంది అభ్యర్థు లు దరఖాస్తు చేసుకోగా, ఉదయం పేపర్-1 పరీక్షకు 3881మంది (87.90శాతం), మధ్యాహ్నం జరిగిన పేపర్-2 పరీక్షకు 3878 మంది (87.81శాతం) హాజరయ్యారు. కలెక్టర్ వెట్రిసెల్వి, జేసీ ధాత్రిరెడ్డి, ఎస్పీ కేపీఎస్.కిశోర్, డీఎస్పీ శ్రావణ్‌కుమార్, ఆర్డీవో అంబరీష్, తదితరులు పరీక్ష కేంద్రాలను సందర్శించారు.

అభ్యర్థుల హడావుడి

గ్రూప్-2 మెయిన్స్ అభ్యర్థులకు ముందస్తు జాగ్రత్తలు సూచించినా అభ్యర్థులు హడావుడిలో ఇబ్బందులు పడ్డారు. వట్లూరులో సీఆర్ఆర్ విద్యా సంస్థలకు చెందిన ఇంజనీరింగ్, పాలిటెక్నిక్, మహిళా కళాశాలల్లో పరీక్ష పరీక్ష కేంద్రా లున్నాయి. హాల్‌టికెట్‌పై వివరాలు స్పష్టంగా ఉన్నా కొందరు అభ్యర్థులు తడబడ్డారు. సీఆర్ఆర్ పేరునే చూశారు తప్ప కేటాయించిన కళాశాల వివరాలను పట్టించుకోకుండా ఆయా కళాశాలల చుట్టూ తిరిగారు. కొందరైతే పరీక్ష గదుల్లోకి వెళ్లి మరో కళాశాలకు వచ్చామని తెలుసుకుని సంబంధిత కేంద్రానికి పరుగులు తీశారు. మరికొందరు హాల్‌టిక్కెట్‌తో పాటు ప్రభుత్వం జారీచేసిన ఫొటో గుర్తింపు కార్డు లేకుండా వచ్చారు. అభ్యర్థుల వెంట వచ్చిన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, స్నేహితులు ఎండ వేడిమి నుంచి ఉపశమనం కోసం సమీపంలోని చెట్లు, భవనాల నీడకు చేరుకున్నారు. మధ్యాహ్నం పేపర్-2 పరీక్షకు ముందు పరీక్ష కేంద్రాల క్యాంటీన్లు, బయట హోటళ్లను ఆశ్రయించారు.

సహకరించిన పోలీసులు

ఏలూరు క్రైం: గ్రూపు 2 పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ఇబ్బందులు లేకుండా పోలీస్‌శాఖ పటిష్ఠ చర్యలు చేపట్టింది. ఆదివారం ఉదయం నుంచి నగరంలో జిల్లా పోలీస్ యంత్రాంగం పికెట్లలో ఉన్నారు. పరీక్షా కేంద్రాల చిరునామా తెలియని అభ్యర్థులకు పోలీసులు సహకరించారు. చివరి నిమిషంలో పరీక్షా కేంద్రాలకు పరుగున వెళుతున్న కొందరు అభ్యర్థులను గుర్తించి మోటార్ సైకిల్‌పై సంబంధిత పరీక్షా కేంద్రానికి చేర్చారు. అభ్యర్థులకు ట్రాఫిక్ సమస్యలు ఎదురవకుండా పోలీస్ వాహనాలు, బ్లూ కోల్ట్స్ వాహనాలతో పర్యటించి చర్యలు తీసుకున్నారు. ఎస్పీ కేపీఎస్ కిశోర్ సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్షా కేంద్రాన్ని పరిశీలించారు. ఎస్పీతో పాటు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్, ఇతర పోలీస్ అధికారులు ఉన్నారు.

ఆశల పూత



- పూతతో మామిడికి కళ
- పిందె కట్టక నిరాశ
- కోడిపేను, తెగుళ్ల దాడి
- నివారణకు రైతుల పాట్లు
- తప్పని పెట్టుబడి భారం

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మామిడి పూత ఆశాజనకంగా ఉండడంతో రైతు మురిసిపోయాడు. పూత పిందె కట్టక మాడిపోవడంతో నిరాశ చెందాడు. మాత్రం చేదు మాత్రమే మిగులుతోంది. ఏటా నష్టాల ఊబి నుంచి గట్టెక్కుతామనే ఆశతో ఉన్న మామిడి రైతుకు ఈ సంవత్సరం కూడా నిరుత్సాహమే మిగిలింది. నూజివీడు డివిజన్ పరిధిలో దాదాపు 60వేల హెక్టార్లలో మామిడి సాగులో ఉంది. నూజివీడు నియోజకవర్గంలోని చాట్రాయి, ముసునూరు, ఆగిరిపల్లి, నూజివీడు మండలాల్లో 56వేల ఎకరాల్లో మామిడి తోటలు విస్తరించి ఉన్నాయి. బంగినపల్లి, తోతాపురి, చిన్నరసం, పెద్దరసం తదితర రకాలను రైతులు సాగు చేస్తున్నారు. సాధారణంగా డిసెంబర్ నుంచి ఫిబ్రవరి వరకు మామిడి పూత దశలో ఉంటుంది. గత సీజన్‌లో నూజివీడు ప్రాంతంలో మామిడి దిగుబడులు అరకొరగా ఉంది. జూన్ నుంచి వర్షాలు పుష్కలంగా ఉండడంతో అందుకు తగ్గట్లుగానే ప్రస్తుత సీజన్‌లో పూత ఆశాజనకంగా వచ్చాయి. 15, 20 రోజులుగా వాతావరణ పరిస్థితుల్లో మార్పులతో మామిడి రైతుకు తీవ్ర నష్టం వాటిల్లే పరిస్థితి నెలకొంది. మామిడిపై కోడిపేను ఉధృతితో పూత పిందెకట్టుగా మారక ముందే మాడిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పూతలో కొద్దిశాతం మాత్రమే పిందెకట్టు కావడంతో ఏం చేయాలో పాలుపోని పరిస్థితి నెలకొంది. ప్రధానంగా బంగినపల్లి, కలెక్టర్ రకాల్లో ఈ పరిస్థితి కనిపిస్తోంది. మరోవైపు కోడిపేనుతో పాటు మసిమంగు, ఎర్రనల్లి తదితర చీడపీడలు ఉధృతి పెరగడంతో వచ్చిన కాపును నిలబెట్టుకునేందుకు రైతులు తీవ్ర వ్యయ ప్రయాసలకు గురికావాల్సి వస్తోంది.

పురుగు మందుల పిచికారీ

మామిడిలో చీడపీడల ఉధృతితో రైతులు సస్యరక్షణ చర్యల్లో భాగంగా పరిమితికి మించి పురుగుమందులు పిచికారీ చేయాల్సిన పరిస్థితి నెలకొంది. దాదాపు రెండు దశాబ్దాల క్రితం మామిడిపై రెండుకు మించి పురుగు మందులు పిచికారీ చేయడం వేళ్లపై లెక్కించే సందర్భంగా ఉండేది. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి పది రోజులకు ఒకసారి పురుగు మందు పిచికారీ చేయాల్సిన పరిస్థితి నెలకొనడంతో మామిడి రైతులు, కౌలుదారులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితులు ఎదురవుతున్నాయి. పేను మాత్రం నివారణ కావడం లేదని రైతులు వాపోతున్నారు. రెండు, మూడు సీజన్‌ల నుంచి కోడిపేను ఉధృతి అధికంగా ఉంది. దీనిపై పూర్తిస్థాయిలో పరిశోధనలు చేసి రైతుకు చేరువ చేయకపోతే నూజివీడు మామిడి చరిత్రగానే మిగిలే ప్రమాదం ఉంది. ఆ దిశగా అడుగులు వేయడంలో వైఫల్యం రైతులకు శాపంగా మారింది.



ఏలూరులో కిటకిటలాడుతున్న చేప, మటన్ దుకాణాలు

చికెన్.. తగ్గెన్..!

● వెలవెలబోయిన దుకాణాలు ● మటన్, చేపలకు డిమాండ్


ఏలూరు రూరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): బర్డ్‌ఫ్లూ భయంతో చికెన్ ధర.. అమ్మకాలు తగ్గిపోయాయి. ఆదివారం చికెన్ దుకాణాలు కొనుగోలుదార్లతో కిటకిటలాడేవి. అమ్మకాలు పెరిగేవి. అలాంటిది ఈ ఆదివారం చికెన్ దుకాణాలు వెలవెలబోతే మటన్, చేపల దుకాణాలు రద్దీగా కనిపించాయి. ఏలూరు వన్‌టౌన్, టూటౌన్ చేపల మార్కెట్, చేపల తూం సెంటర్ కిటకిటలాడింది. చికెన్ వద్దు అనుకున్నవారిలో అత్యధికులు చేపలు, మటన్ వైపు మొగ్గు చూపారు. ఉదయం 6 గంటలనుంచే చేపల మార్కెట్‌కు తరలి వచ్చారు. కొన్నిరకాల చేపల ధరలు పెరిగినా కొనుగోళ్లు తగ్గలేదు. చికెన్ కేజీ రూ.120 చొప్పున విక్రయించినా అమ్మకాలు లేవు. మటన్ ధర కేజీ రూ.800 నుంచి అమాంతం వెయ్యి రూపాయలకు పెంచారు.

చికెన్ మేళాకు పోటెత్తారు!

ఒకవైపు చికెన్ అమ్మకాలు పడిపోతే.. అవగాహన కోసం నిర్వహించిన చికెన్ మేళాకు జనం పోటెత్తారు. ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో ఆదివారం జిల్లా పౌల్ట్రీ ఫార్మర్స్ ట్రేడర్స్ అసోసియేషన్ ఏర్పాటుచేసిన చికెన్, గుడ్లు, ఆహార మేళా లో చికెన్ పలావ్, చికెన్ ఫ్రై, లాలీపాప్, ఎగ్‌కర్రీ వంటకాలను ఆరగించారు. జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి గోవిందరాజు మాట్లాడుతూ ఉడికించిన చికెన్, గుడ్లను తినవచ్చని తెలిపారు. అసత్య ప్రచారంతో చికెన్, గుడ్లు వ్యాపారం దారుణంగా పడిపోయిందని, జిల్లా పౌల్ట్రీ ఫార్మర్స్ అసోసియేషన్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. చికెన్ మేళాకు పెద్దఎత్తున ప్రజలు ఎగబడ్డారు.

కల నెరవేరేనా?

నేటి నుంచి బడ్జెట్ సమావేశాలు



ఈసారి అందరూ మెచ్చేవిధంగానే బడ్జెట్ ఉండబోతుందా.. ప్రతిపక్షంలేని జిల్లాలో ఆ పాత్ర కూడా తామే తీసుకుని ఎమ్మెల్యేలు బాధ్యతగా వ్యవహరిస్తారా.. అపరిష్కృత సమస్యలకు చెక్ పెట్టేందుకు నిధులు రాబట్టేందుకు చేసిన ప్రయత్నాలు బడ్జెట్‌లో కనిపించబోతున్నాయా.. బడ్జెట్ ఉమ్మడి జిల్లా ప్రజల కల నెరవేరుతుందా..!

- సాగునీటి పథకాలతోపాటు తాగునీటికి ప్రాధాన్యం ఇస్తారా..
- ఎత్తిపోతల పథకాలకు ఊపిరి పోయనున్నారా..
- కొల్లేరు రెగ్యులేటర్లకు మోక్షం కలిగేనా..
- ఆక్వాకు ప్రోత్సాహంపై ఆశలు
- కాలువల ఆధునికీకరణకు కేటాయింపులపై ఎదురుచూపు

ఎమ్మెల్యేలు ఏం చేయబోతున్నారు ?

ఉమ్మడి పశ్చిమలో వైసీపీకి స్థానం లేకుండా కూటమి విజయకేతనం ఎగురవేసింది. అసెంబ్లీలో జిల్లా నుంచి ప్రతిపక్ష పాత్ర పోషించేవారే లేరు. ఇప్పటికే డెల్టా ప్రాంతానికి చెందిన ఎమ్మెల్యేలు ఆక్వా, గోదావరి కాలువల ఆధునికీకరణ, గోదావరి గట్టు పటిష్టత, వరితోపాటు మిగతా పంటలకు సాయం, రైతాంగాన్ని ఆదుకునేలా వెసులుబాటు ఇవ్వాలని అనేకమంది రైతులు ఒత్తిడి చేస్తూ వచ్చారు. మెట్ట ప్రాంతంలో పామాయిల్, జొన్న రైతులు ఇదే డిమాండ్‌తో ఉన్నారు. సోమవారం నుంచి జరగనున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో కూటమి ఎమ్మెల్యేలంతా ఏ సమస్యలను ప్రస్తావించబోతున్నారు, తమ కష్టాలను తీర్చే విధంగా స్పందిస్తారా.. సాదాసీదాగా వ్యవహరిస్తారా అనే సందేహం లేకపోలేదు. సాధారణంగా బడ్జెట్ సమావేశాల్లో ఇతర అంశాలను ప్రస్తావించే అవకాశం పెద్దగా ఉండదు. కీలక విభాగాలపై పూర్తి అనుభవం ఉన్న వారే కొన్ని ప్రశ్నలు సంధించి సమాధానాలు రాబడతారు. అంతా అధికారపక్ష సభ్యులే కాబట్టి వీరిలో స్వల్ప సంఖ్యలో మాత్రమే మాట్లాడే అవకాశం లేకపోలేదు. కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న ఆశలు అంతా ఇంతా కాదు.

ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి

అసెంబ్లీ వార్షిక బడ్జెట్‌లో ఉమ్మడి జిల్లాకు కేటాయింపులపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. కూటమి ప్రభుత్వం తగిన కసరత్తు చేసి అన్ని ప్రభుత్వ విభాగాలకు కాస్త ఊపిరి పోసేవిధంగా నిధులు కేటాయిస్తుందని, ప్రజల కల నెరవేరుతుందని భావిస్తున్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో కూటమి ఎమ్మెల్యేలదే ఆధిపత్యం. ఏ ఒక్క స్థానంలో వైసీపీకి చోటు దక్కలేదు. ఎమ్మెల్యేలంతా తమ నియోజకవర్గాల అభివృద్ధికి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చారా, లేదా అనేది బడ్జెట్ కేటాయింపులను బట్టి తేలనుంది.

గృహ సముదాయాలపైనా ఆశలు

ప్రభుత్వం ఏదైనా పక్కా ఇళ్ల కోసం ప్రజలకు ఎదురుచూపులు తప్పడంలేదు. గడిచిన వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆర్భాటంగా ఊరూవాడా జగనన్న కాలనీలు కట్టేస్తామని గొప్పలకు పోయారు. తీరా పూర్తి చేయలేక చివరి క్షణాల్లో చేతులెత్తేశారు. లేఅవుట్‌లలో వేలాది ఇళ్ల స్థలాల్లో నిర్మాణాలు లేవు. ఈసారి బడ్జెట్‌లో ప్రభుత్వం ఏ మేరకు పక్కా ఇళ్లకు ప్రోత్సాహం ఇస్తుందనేదే పేద వర్గాల్లో సందేహం. దీనికితోడు ఏలూరు, భీమవరం, తణుకు, జంగారెడ్డిగూడెం, నూజివీడు, తాడేపల్లిగూడెంతో సహా అనేక ప్రాంతాల్లో ఎక్కడికక్కడ నిలిచిపోయిన టిడ్కో ఇళ్ళపైనే ఇప్పుడు అందరి దృష్టి పడింది. వార్షిక బడ్జెట్‌లో టిడ్కో ఇళ్ల సముదాయం పూర్తయ్యేలా ఎలాంటి నిర్ణయం ప్రకటిస్తారనే దానిపై పట్టణవాసులు ఆతృతగా ఎదురుచూస్తున్నారు.


గోదావరి గట్లు బలహీనం

గోదావరి గట్టు పరిస్థితి అత్యంత దారుణం. గట్టు పటిష్టతకు 2013 నుంచి 19 వరకు అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం నిధులు ఇస్తూనే వచ్చింది. పోలవరం నుంచి నరసాపురం వరకు గట్టు పటిష్టతకు వందల కోట్లు ఖర్చు చేశారు. వైసీపీ ప్రభుత్వంలో దీనిని గాలికొదిలేశారు. ఈ మధ్యనే తన నియోజకవర్గ పరిధిలో గోదావరి గట్టు పటిష్టతకు జల వనరుల మంత్రి నిమ్మల రామానాయుడు కొంత చొరవ చూపడమే కాకుండా రైతులకు అండగా నిలిచారు.



ఆక్వా సంగతేంటి?

ఆక్వా రంగం ఒడిదుడుకుల్లో ఉంది. ఉమ్మడి పశ్చిమలో ఆక్వా భారీగా విస్తరించింది. దీనినే నమ్ముకుని ఉన్న వేలాది మంది రైతులు ఏటా నష్టాలపాలవుతున్నారు. వైరస్ కమ్ముకొచ్చి ఈ రంగాన్ని అతలాకుతలం చేస్తుంది. కోట్లాది రూపాయలు పెట్టుబడులు చెరువుల పాలవుతున్నాయి. దీనికితోడు ఇటీవల కేంద్ర బడ్జెట్‌లో వ్యాపార రంగానికి ఊతమిచ్చేలా ప్రోత్సాహకాలు ఉంటాయని భావించినా నిరాశే కలిగింది. ఆఖరుకు విద్యుత్ చార్జీల తగ్గింపు డిమాండ్ ఎవరికీ పట్టనేలేదు. ప్రస్తుత బడ్జెట్‌లోనైనా ఆక్వాను ప్రోత్సహించే చర్యలు ఉంటాయా, లేదా అనేదే ఇప్పుడు ఆ రంగాన్ని నమ్ముకుని ఉన్న వేలాది మంది రైతుల ప్రశ్న. వైసీపీ హయాంలో ఆక్వా ధరల స్థిరీకరణ అంటూ ఆగమాగం చేశారు. ఇప్పటికీ రైతులు కోలుకోలేదు. వైరస్ వ్యాప్తితో నష్టం, మేత, సీడ్, విద్యుత్ చార్జీల భారం ఆక్వా రైతులను కుంగదీస్తున్నాయి. అన్నీ దాటుకుని ఉత్పత్తులు సాధిస్తే ధర కోల్పోతున్నారు. కూటమి ప్రభుత్వ ప్రోత్సాహంపైనే ఆశలు పెంచుకున్నారు.




కొల్లేరుకు ఏం చేయబోతున్నారు

ఉమ్మడి పశ్చిమలో కొల్లేరు సరస్సు అత్యంత కీలకం. కొల్లేరును ఉప్పునీరు ముంచెత్తకుండా సహజ సిద్ధంగానే మంచినీటి సరస్సులా కొనసాగేలా, మత్స్య సంపదకు ఆటంకంలేకుండా, సరస్సు పరిసరాల్లో ఉప్పునీటి కయ్యలు ఏర్పడకుండా తక్షణం రెగ్యులేటర్ల నిర్మాణానికి అనువుగా నిధులు కేటాయిస్తారని గత బడ్జెట్‌లోనే అందరూ ఆశతో ఎదురుచూశారు. కాని అప్పట్లో రెగ్యులేటర్ల నిర్మాణానికి తగినంత నిధులు కేటాయించ లేదు. సముద్రపు నీరు ఉప్పుటేరు నుంచి కొల్లేరు వైపు ఎగబాకకుండా రెగ్యులేటర్లు దోహదపడతాయి. గడిచిన వైసీపీ ప్రభుత్వంలో పెద్ద ఎత్తున ప్రచారమైతే చేశారు కాని నిధుల విషయానికి వచ్చేసరికి పైసా విదల్చలేదు. దీనిపై అప్పట్లోనే తీవ్ర నిరసన వ్యక్తమైంది. మరి ఈసారి బడ్జెట్‌లో కేటాయింపులు ఎలా ఉండబోతున్నాయనేదానిపైనే అందరి ఉత్కంఠ. దీనికి తోడు కొల్లేరు కాంటూరు సరిహద్దుల నిర్ధారణపై ఈ మధ్యనే సుప్రీం కీలక ఆదేశాలు జారీ చేసింది. కొల్లేరును నమ్ముకున్న అనేక కుటుంబాలు ఈ దిశగానే ఎదురుచూస్తున్నాయి.



ఎత్తిపోతలపై కనికరించాలి

చింతలపూడి ఎత్తిపోతల పథకం ముందుకు సాగడం లేదు. ఇంతకుముందు తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఉమ్మడి పశ్చిమతోపాటు కృష్ణాలోని మెట్ట ప్రాంత రైతులకు సాగునీటిని ఇవ్వాలని కార్యాచరణ ప్రణాళిక రూపొందించింది. దాదాపు 4.6 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడమే కాకుండా 230 గ్రామాలకు తాగునీరు అందించేందుకు సంకల్పించింది. మరోవైపు అంచనా వ్యయాన్ని కూడా 4,700 కోట్లకుపైగా పెంచింది. దీనిని కూడా గడిచిన ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం నేరుగా నీరుగార్చింది. నయాపైసా ఇవ్వకుండానే ముఖం చాటేసింది. మెట్ట ప్రాంతంలో జలాశయాలవైపు కన్నెత్తి చూడలేదు. తాడిపూడి సమీపాన చింతలపూడి హెడ్‌వర్క్స్‌కు దిక్కుమొక్కు లేదు. ఈ పరిస్థితిపై మెట్ట రైతులు తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. గడిచిన సాధారణ ఎన్నికల్లో వైసీపీని కాదని కూటమికి పట్టంకట్టేలా వ్యవహరించారు. ఈ ఎత్తిపోతల గోదావరి జలాలను తెచ్చి మెట్ట ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తుందని రైతులు దశాబ్ద కాలంగా ఎదురుచూస్తూనే ఉన్నారు. దీనికితోడు తాడిపూడి ఎత్తిపోతల కింద పిల్ల కాలువల పనులు పూర్తి చేస్తే ఏకంగా 2.6లక్షల ఎకరాలకు సాగునీరు ఇవ్వడానికి ఆస్కారం ఉంది. దీనిపై రైతులు ఆశలు పెంచుకున్నారు. పోలవరం ప్రాజెక్టు పనులు ఇప్పటికే ఊపందుకున్న తరుణంలో మెట్ట ప్రాంతానికి ఆయువుపట్టు అయిన తాడిపూడి, చింతలపూడి ఎత్తిపోతల పథకాలకు కూటమి ప్రభుత్వం జీవం పోయాలని ఈ బడ్జెట్ సమావేశాలపై రైతులు ఆశలు పెట్టుకున్నారు.



కాలువల ఆధునికీకరణ చేస్తారా..?

వాస్తవానికి వ్యవసాయం, ఆక్వా అత్యంత కీలకంగా ఉన్న ఉమ్మడి జిల్లాల కాలువల ఆధునికీకరణ మరుగునపడింది. గడిచిన ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం కాల్వల అభివృద్ధికి నయా పైసా కేటాయిస్తే ఒట్టు. ప్రధాన కాలువలతో పాటు పిల్ల కాలువల్లో సైతం నీటి పారుదలకు ఆటంకాలే. తమ ప్రాంత రైతులకు జరుగుతున్న అన్యాయంపై అప్పటి ఎమ్మెల్యేలు మాట్లాడలేకపోయారు. ఉమ్మడి జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన మంత్రులదీ ఇదే పాత్ర. చాలాచోట్ల శిథిలమైన పంట కాలువల లాకులు ఆనాటి ప్రభుత్వ తీరుకు అద్దం పడుతున్నాయి. 2007లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం రూ.1,407 కోట్లతో కాలువల ఆధునికీకరణకు శ్రీకారం చుట్టింది. కాని 2025 వరకు వ్యయం పెరుగుతూనే వచ్చింది తప్ప పనులు మాత్రం పూర్తికాలేదు. 2013-19 మధ్య అప్పటి టీడీపీ ప్రభుత్వం ఆధునికీకరణ పనులకు కొన్ని నిధులు కేటాయించగలిగింది. 2019 తరువాత ఈ పురోగతిని జగన్ ప్రభుత్వం కాలదన్నింది. ఈసారైనా బడ్జెట్‌లో సంతృప్తికర ఫలితాలు ఉంటాయా, లేదా అనేది రైతుల ఆతృత.

ముదినేపల్లి జూనియర్ కళాశాల

ప్రిన్సిపాల్ సస్పెన్షన్

ఉత్తర్వులు జారీ చేసిన ఆర్జేడీ

మధ్యాహ్న భోజన పథకం ప్రారంభానికి ఆలస్యంగా హాజరు

7

కంట్లో కారం కొట్టి

రూ. 2.41 లక్షలు అపహరణ

7

సందేశాత్మకంగా నాటికలు

ఏలూరులో నాటకోత్సవాలు

7



త్వరలో తెలుగు రాష్ట్రాల్లో బోర్డు పరీక్షలు మొదలు కాబోతున్నాయి. రెండు రాష్ట్రాల్లో కలిపి గత సంవత్సరం సుమారు 10 లక్షల మంది పదో తరగతి, 12 లక్షల మంది ఇంటర్మీడియట్ పరీక్షలు రాశారు. ఈ సంవత్సరం కూడా దాదాపు అంతే సంఖ్యలో విద్యార్థులు పరీక్షలు రాయబోతున్నారు. సమగ్రమైన ప్రణాళిక, సమయ నిర్వహణతో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని విద్యా నిపుణులు చెబుతున్నారు. బోర్డు పరీక్షల మార్కులు ఉన్నత విద్యా అవకాశాలను నిర్ణయిస్తాయి. ప్రిపరేషన్ బాగుంటే ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. పరీక్షా హాల్‌లో సమయం సరిపోతుంది. అలాగే సరైన స్టడీ ప్లాన్, రివిజన్, మాక్ టెస్టులు రాయడం వల్ల బాగా గుర్తుంటాయి. టాపర్ల టిప్స్ అనుసరించడం, తప్పులు తగ్గించడం ఉత్తమ ఫలితాలకు దోహదం చేస్తాయి. పరీక్షలకు ఉన్న ఈ కొద్ది రోజుల్లో స్మార్ట్ వర్క్ ముఖ్యం అంటున్నారు నిపుణులు...



పరీక్షల ముందు ఇలా చదవండి

ప్లానింగ్ ముఖ్యం

1. తప్పక చదవాల్సిన చాప్టర్లను గుర్తించండి. బోర్డు పరీక్షలలో ఎక్కువ స్కోరింగ్ టాపిక్స్ తెలుసుకోండి.
2. రోజువారీ టైమ్ టేబుల్ తయారు చేసుకోండి. ప్రతి రోజు చదవడానికి ఖచ్చితమైన సమయాన్ని కేటాయించండి.
3. చిన్న చిన్న లక్ష్యాలను నిర్ధారించుకోండి. కష్టమైన సబ్జెక్టుల్లో ఒక్కో రోజు ఒక హార్డ్ ఛాప్టర్, ఈజీ చాప్టర్ లేదా ముఖ్యమైన టాపిక్స్ పూర్తిచేయండి.
4. సమయం వృధా చేయొద్దు. మొబైల్, టీవీ వంటి దృష్టి మళ్లించే విషయాలను తగ్గించాలి.
5. కనీసం 6-8 గంటలు నిద్ర ముఖ్యం.

మంచి మార్కుల చిట్కాలు

6. సొంత నోట్స్ ప్రిపేర్ చేసుకోండి. ముఖ్యమైన పాయింట్లు, ఫార్ములాలు, డయాగ్రామ్స్ ఒక దగ్గర రాసుకోండి.
7. రివిజన్ చేయండి. ఒకే విషయాన్ని పదే పదే చదివితే మరచిపోయే ప్రసక్త లేదు.
8. పాత ప్రశ్నపత్రాలను ప్రాక్టీస్ చేయండి. గత 5-10 ఏళ్ల ప్రశ్నపత్రాలను రాసి ప్రాక్టీస్ చేయండి. అకడమిక్ పరీక్షల్లో ఇవే దాదాపుగా రిపీట్ అవుతుంటాయి.
9. పరీక్షల్లో టైమ్ మేనేజ్‌మెంట్ ముఖ్యం. మాక్ టెస్ట్ రాయడం ద్వారా లోటుపాట్లను అధిగమించవచ్చు.

సబ్జెక్టుకు ఒక వ్యూహం

10. మేథ్స్ రోజూ ప్రాక్టీస్ చేయాలి. రోజుకు కనీసం 10-15 ముఖ్యమైన లెక్కలు సాల్వ్ చేయండి.
11. సైన్స్ విషయంలో ఫార్ములాలు, డయాగ్రామ్స్, ఈక్వేషన్స్, రియాక్షన్స్ ఒక దగ్గర రాసుకుని ప్రాక్టీసు చేయండి.
12. సోషల్ స్టడీస్‌లో డేట్స్, ఈవెంట్స్ ముఖ్యం. కథల మాదిరిగా చదివి అర్థం చేసుకోవడం ఉత్తమం.
13. ఇంగ్లిష్, తెలుగు సబ్జెక్టుల్లో వ్యాకరణం ప్రాక్టీస్ చేయండి. ముఖ్యమైన వ్యాకరణ నియమాలను రాసి చదవండి.
14. స్మార్ట్ స్టడీ మెథడ్స్ ఉపయోగించండి.

పరీక్ష రోజు

15. తక్కువ ఒత్తిడితో చదవండి. కొండను ఎత్తుకుంటున్నట్లుగా కాకుండా ఆసక్తిగా చదవండి.
16. ఒత్తిడిని తగ్గించుకోవడానికి రోజుకు 10 నిమిషాలు ధ్యానం, యోగా వంటివి చేయండి.
17. ఆకుకూరలు, పండ్లు, డ్రైఫ్రూట్స్ వంటి పోషకాహారాన్ని పెంచండి. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం ద్వారా మెదడు చురుకుగా ఉంటుంది.
18. పరీక్ష ముందు రోజు కొత్త విషయాలు చదవొద్దు. రివిజన్ మాత్రమే చేయాలి.
19. పరీక్ష రోజు ప్రశాంతంగా ఉండండి. సమయం కంటే ముందే హాల్‌కు చేరుకోండి. ఇతరులు ఎలా చదివారు, ఎంత చదివారు అనే విషయాలపై చర్చ వద్దు. ప్రశాంతంగా ప్రశ్నపత్రం చదివి సమాధానాలు రాయండి.

- డాక్టర్ పవన్‌కుమార్ కాసు

సమాధానాలు రాసేప్పుడు



1. ప్రశ్నను పూర్తిగా చదవండి. తొందరలో తప్పుగా అర్థం చేసుకోవద్దు. ముఖ్యంగా 'ఎక్స్‌ప్లెయిన్, కంపేర్, డిస్క్రైబ్' వంటి పదాలు గమనించండి.
2. టైమ్ ప్లానింగ్ ముందే చేసుకోండి. చిన్న ప్రశ్నలకు తక్కువ సమయం, దీర్ఘ సమాధానాలకు ఎక్కువ సమయం పక్కాగా పాటించండి. బాగా వచ్చు కదా అని చిన్న ప్రశ్నకు ఎక్కువ సమయం తీసుకుని చివర్లో ఇబ్బంది పడొద్దు.
3. స్పష్టమైన, క్రమబద్ధమైన రాత ముఖ్యం. సమాధానాన్ని పాయింట్స్‌గా రాయండి. ఎక్కువ పేరాలు అన్నట్లు కాకుండా లాజికల్ ఫ్లోలో ఉండేలా చూసుకోండి.
4. ముఖ్యమైన పాయింట్లకు అండర్‌లైన్ చేయండి. ఆయా పదాలను హైలైట్ చేయడం వల్ల పరిశీలకుడు సమాధానం స్పష్టంగా చూడగలుగుతాడు.
5. తగిన డయాగ్రామ్స్, చార్ట్‌లు వాడండి. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, జాగ్రఫీ వంటి సబ్జెక్టులకు సరైన పటాలు, డయాగ్రామ్స్ గీయండి.
6. తప్పులు తగ్గించేందుకు స్పష్టమైన భాష వాడండి. అపరిపక్వమైన పదజాలం, క్లిష్టమైన వ్యాకరణాన్ని ఉపయోగించ వద్దు.
7. లెక్కలు, సైన్స్‌ల్లో స్టెప్ బై స్టెప్ ఆన్సర్ రాయండి. నేరుగా సమాధానం రాయకుండా, ప్రతి స్టెప్ చూపించి రాయడం వల్ల పూర్తి మార్కులు వస్తాయి.
8. మినిమమ్, మాగ్జిమమ్ లిమిట్స్‌లో రాయండి. రెండు మార్కుల ప్రశ్నకు 10 లైన్లు రాయడం, 5 మార్కుల ప్రశ్నకు 3 లైన్లు రాయడం తప్పు. సరిపడే సమాచారం అందించండి.
9. చివర్లో సమాధానాలు చెక్ చేసుకోండి. తప్పులు సవరించుకునేందుకు చివరి 5-10 నిమిషాలు కేటాయించండి.
10. పేపర్‌ను క్లీన్‌గా ఉంచండి. అర్థం కాని రాత, ఎక్కువ సార్లు కొట్టివేతలు, స్క్రిబ్లింగ్ ఉండకుండా చూసుకోవాలి.

దిక్సూచి
DIKSUCHI

ఐఐఎమ్‌లు అందించే ఉచిత కోర్సులు ఇవే

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లు పలు విభాగాలకు సంబంధించిన ఉచిత కోర్సులను అందిస్తున్నాయి. ఈ కోర్సుల గురించి కేంద్రప్రభుత్వం నిర్వహించే 'స్వయం పోర్టల్' (https://swayam.gov.in/) ద్వారా తెలుసుకోవచ్చు.

బిజినెస్ కమ్యూనికేషన్ ఎసెన్షియల్స్: ఇది ఐఐఎం బెంగళూరు అందించే 6 వారాల కోర్సు. ఉద్యోగ, వ్యాపారాల్లోని సవాళ్లను ఎదుర్కొనేలా కమ్యూనికేషన్ స్కిల్స్‌ను పెంపొందిస్తారు. 2025 మే 18 నుంచి క్లాసులు మొదలవుతాయి. 2025 ఫిబ్రవరి 28 వరకు నమోదు కావచ్చు.

బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ మార్కెట్స్: రిస్క్ మేనేజ్‌మెంట్‌పై ఐఐఎం బెంగళూరు అందించే ఈ కోర్సు కాలవ్యవధి ఆరు వారాలు. ఎన్‌రోల్‌మెంట్ 2025 ఫిబ్రవరి 28 వరకు చేసుకోవచ్చు.

ఆర్గనైజేషనల్ బిహేవియర్ అడ్వాన్స్‌డ్ టాపిక్స్: ఐఐఎం షిల్లాంగ్ అందించే ఆరు వారాల కోర్సు ఇది. మేనేజ్‌మెంట్ విద్యార్థులకు ఉపయోగం.

స్ట్రాటజిక్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్: ఇది 8 వారాల కోర్సు. ఐఐఎం బెంగళూరు అందిస్తోంది.

వాల్యుయేషన్ అండ్ క్రియేటింగ్ సస్టయినబుల్ వాల్యూ: వాల్యుయేషన్ మెథడ్స్, ఎలా వాల్యుయేషన్ చేయాలో ఉదాహరణలతో సహా వివరిస్తారు. ఐఐఎం బెంగళూరు అందించే ఆరు వారాల కోర్సు ఇది. 2025 ఫిబ్రవరి 28 తేదీ వరకు ఎన్‌రోల్ చేసుకోవచ్చు.

డిజిటల్ మార్కెటింగ్: ఐఐఎం బెంగళూరు నిర్వహించే ఆరు వారాల కోర్సు ఇది. డిజిటల్ ఇన్‌బౌండ్, ఔట్‌బౌండ్ మార్కెటింగ్, లీవరేజింగ్ సోషల్ మీడియా, కస్టమర్ ఇన్‌సైట్స్ తదితరాలు నేర్పిస్తారు. 2025 ఫిబ్రవరి 28 తేదీలోపు నమోదు చేసుకోవాలి.

హెచ్‌ఆర్‌ఎం స్ట్రాటజీ ఎగ్జిక్యూషన్: ఐఐఎం అహ్మదాబాద్ నిర్వహిస్తున్న ఆరు వారాల కోర్సు. 2025 ఫిబ్రవరి 28 తేదీలోపు నమోదు చేసుకోవాలి.

డేటా డ్రివెన్ మార్కెటింగ్ డెసిషన్ మేకింగ్: మార్కెటింగ్ విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని ఐఐఎం విశాఖపట్నం డిజైన్ చేసిన 8 వారాల కోర్సు ఇది. కొనుగోళ్లను ప్రభావితం చేసే అంశాలను బోధిస్తారు.

ఫైనాన్షియల్ అకౌంటింగ్ అండ్ అనాలిసిస్: ఐఐఎం బెంగళూరు డిజైన్ చేసిన కోర్సు. ఫైనాన్షియల్ కాన్సెప్ట్స్, ఫైనాన్షియల్ స్టేట్‌మెంట్స్, అకౌంటింగ్ స్టాండెడ్స్ తదితరాలు ఇందులో ఉంటాయి.

జనరేటివ్ ఏఐ, లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్: ఐఐఎం బెంగళూరు అందించే 8 వారాల కోర్సు. 2025 ఫిబ్రవరి 28 తేదీలోపు నమోదు చేసుకోవాలి.

SCHOLARSHIP ALERT

Ramalingaswami Re-entry

Description: Ramalingaswami Re-entry Fellowship 2024-25 is offered by the Department of Biotechnology, Ministry of Science & Technology, Government of India, to students with relevant PhD/MD degrees or equivalent.
Eligibility: This is open to Indians below 45 years on the application closing date. Applicants must hold a PhD/MD/M.Tech or equivalent degree in specified fields.
Prizes & Rewards: A fellowship of 1,35,000 per month and other benefits. ***Last Date:*** 28-02-2025
Url: www.b4s.in/aj/RFIB2

Quad Fellowship

Description: It is initiated by the governments of Australia, India, Japan, and the US, is administered by the Institute of International Education (IIE).
Eligibility: Open to citizens or legal permanent residents of specific countries including India. Applicants must be at least 18 years of age at the time of application submission and possess a bachelor's degree
Prizes & Rewards: The fellowship offers a one-time stipend of $40,000 and other benefits.
Last Date: 03-03-2025
Url: ww.b4s.in/aj/QUFD1

buddy4study.com

ఆంత్రప్రెన్యూర్ కావడానికీ కోర్సులు ఉన్నాయి

ఉద్యోగాలు చేయడం కాదు, ఉద్యోగాలు ఇచ్చేస్థాయికి ఎదగాలి. 'ఆంత్రప్రెన్యూర్‌షిప్' కరిక్యులమ్‌లో భాగమైతేనే ఇది సాధ్యం. దేశవ్యాప్తంగా విద్యార్థులు, ప్రొఫెషనల్స్‌లో ఆంత్రప్రెన్యూర్ మైండ్‌సెట్ అభివృద్ధి అవుతుందనే ఆలోచనతో హైదరాబాద్ ఐఐటీ 'ఇన్నోవేషన్, ఆంత్రప్రెన్యూర్‌షిప్' స్కూల్‌ను ప్రారంభించింది. అదే బీవీఆర్ సైయెంట్ (బీవీఆర్ స్కూల్ ఆఫ్ ఇన్నోవేషన్ అండ్ ఆంత్రప్రెన్యూర్‌షిప్). భారతదేశంలో ఆంత్రప్రెన్యూర్‌షిప్‌పై ప్రత్యేక స్కూల్ ఇది ఒక్కటే. ఔత్సాహిక పారిశ్రామికవేత్తల సంఖ్యను పెంచడం, అవసరమైన నైపుణ్యాలను పెంపొందించడం, అవసరమైన వాతావరణాన్ని ఏర్పడరచడం లక్ష్యాలుగా 2024 జనవరిలో దీనిని ఏర్పాటు చేశారు.

- ఇక్కడ ఫార్మల్ డిగ్రీలు కాకుండా ఇన్నోవేషన్, ఆంత్రప్రెన్యూర్‌షిప్‌పై షార్ట్‌టర్మ్ కోర్సులు అందిస్తారు. వీటికి సంబంధించి ఇంజనీరింగ్ వంటి కాలేజీలకు, కార్పొరేట్ సంస్థలకు వెళ్లి అవగాహన కల్పిస్తారు. ఆలోచనలు అవకాశాలుగా, బిజినెస్‌గా ఎలా మలచాలో ఇండస్ట్రీకి చెందిన ప్రముఖులు, ఐఐటీ ఫ్యాకల్టీలు ఇక్కడ శిక్షణ ఇస్తారు. దీనితోపాటు టీహబ్, ఇతర ఇన్నోవేషన్ సెంటర్‌లతో కలిసి వర్క్ చేస్తున్నారు.

కోర్సులు: ప్రస్తుతం బీవీఆర్ సైయెంట్ కొన్ని కోర్సులను ఆఫర్ చేస్తోంది. 'ప్రొడక్ట్ మేనేజ్‌మెంట్ ఇన్ డిజిటల్ ఎరా' కోర్సు రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. త్వరలో 'డిజిటల్ ఆంటర్ ప్రైజెస్', 'ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ మేనేజ్‌మెంట్ ఫర్ ఆంత్రప్రెన్యూర్స్' తదితర కోర్సులు నిర్వహించనున్నారు. వీటికి సంబంధించిన పూర్తి వివరాల కోసం బీవీఆర్ సైయెంట్ వెబ్‌సైట్ చూడవచ్చు.



Address: BVR SCIENT, IIT- Kandi, Sangareddy, Telangana– 502284 **Mobile:** +91 9160006190, https://bvrscient.iith.ac.in/

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

కర్మఫలం నేపథ్యంలో..



అను ఇమ్మాన్యుయేల్, శివ కందుకూరి ప్రధాన పాత్రల్లో ఆండ్రూ బాబు దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'బూమరాంగ్'. లండన్ గణేశ్, డాక్టర్ ప్రవీణ్ రెడ్డి నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్రంలోని 'గ్లింప్స్'ని చిత్ర బృందం లాంచ్ చేసింది. ఈ సందర్భంగా శివ కందుకూరి మాట్లాడుతూ 'ఈ సినిమాలో ఒక డార్క్ సైడ్ ఉంది. కచ్చితంగా ఇది డిఫరెంట్ మూవీ అవుతుంది' అని చెప్పారు. చిత్ర దర్శకుడు ఆండ్రూ బాబు మాట్లాడుతూ 'కరోనా సమయంలో చాలా కథలు రాశాను. అందులోంచి ఎంపిక చేసిన మొదటి కథ 'బూమరాంగ్'. ఇది మెసేజ్ ఓరియెంటెడ్ సైకలాజికల్ థ్రిల్లర్ చిత్రం' అని తెలిపారు. నిర్మాత ప్రవీణ్‌రెడ్డి మాట్లాడుతూ 'అవుట్ పుట్ అద్భుతంగా వచ్చింది. మీ అందరి సపోర్ట్ కావాలి' అని కోరారు. సవాలు విసిరే కథ ఇది. శివ కందుకూరి మంచి నటుడు. భిన్నమైన కథలు చేస్తున్నారు' అని ఫిల్మ్ ఛాంబర్ సెక్రటరీ కె.ఎల్. దామోదర ప్రసాద్ అన్నారు.

శబ్దం ఒక అద్భుతం



నాని

"హారర్ సినిమా చూసినా కళ్లు చెమ్మగిల్లుతాయని నేను ఎప్పుడూ అనుకోలేదు. మంచి కథతో పాటు భావోద్వేగాలు ఉన్న చిత్రం 'శబ్దం'. ఈ సినిమా నేను చూశాను. అద్భుతంగా ఉంది" అని నాని అన్నారు. ఆది పినిశెట్టి కథానాయకుడిగా, అరివళగన్ దర్శకత్వంలో శివ నిర్మించిన చిత్రమిది. సిమ్రాన్ లైలా, లక్ష్మీ మీనన్ కీలకపాత్రలు పోషించారు. ఈ నెల 28న విడుదలవుతోంది. ఈ సందర్భంగా యూనిట్ ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. ముఖ్య అతిథిగా హాజరైన నాని మాట్లాడుతూ 'ఉపయోగించుకోవాలే కానీ సౌండ్ కూడా ఒక ఆయుధం అవుతుందనే అంశాన్ని 'శబ్దం' చిత్రంలో అద్భుతంగా చూపారు' అని ప్రశంసించారు. ఆది పినిశెట్టి మాట్లాడుతూ 'వైశాలి నా కెరీర్‌లో స్పెషల్ మూవీ. ఇప్పుడు శబ్దం కూడా నాకు స్పెషల్ మూవీ అవ్వాలని కోరుకుంటున్నాను' అన్నారు. తమన్ తన సంగీతంతో సినిమాకు ప్రాణం పోశాడని అరివళగన్ చెప్పారు.



అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తుంది

సందీప్ కిషన్

సందీప్ కిషన్, రీతూ వర్మ, అన్షు ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'మజాకా'. త్రినాధ రావు నక్కిన దర్శకత్వంలో రాజేశ్ దండా, ఉమేశ్ కెఆర్ బన్సల్ నిర్మించారు. ఈనెల 26న విడుదలవుతోంది. తాజాగా ఈ చిత్రం ట్రైలర్‌ను లాంచ్ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో హీరో సందీప్ కిషన్ మాట్లాడుతూ 'నా కెరీర్‌లో హయ్యస్ట్ నెంబర్స్‌ని ఈ సినిమా ఇస్తుంది. థియేటర్‌లో కుటుంబసమేతంగా చూసే చిత్రమిది. రావు రమేశ్ అద్భుతంగా నటించారు. ఆయన వల్ల కథ మరింత పండింది' అని చెప్పారు. చిత్ర దర్శకుడు త్రినాథరావు మాట్లాడుతూ 'నేను ప్రతి సీన్‌లో మ్యాజిక్ ఉండాలని నమ్ముతాను. నా ప్రతి సినిమాలో కూడా మ్యాజిక్ జరుగుతుంది. ఇందులో కూడా ఓ మ్యాజిక్ ఉంది. శివరాత్రి నాడు డబుల్ మ్యాజిక్ జరుగుతుంది. డబుల్ బ్లాక్ బస్టర్ అవుతుంది' అని తెలిపారు. రావు రమేశ్ మాట్లాడుతూ 'ఇలాంటి సినిమా చేయడం నాకు కొత్తే. ఇందులో రొమాంటిక్‌గా నటించడం చాలా సవాల్‌గా అనిపించింది. ఒక ఎమోషనల్ సీన్ ఉంది. అది ఐకానిక్‌గా నిలిచిపోతుంది' అని అన్నారు. హీరోయిన్ రీతూ వర్మ మాట్లాడుతూ 'ఈ సినిమాని ప్రేక్షకులు తప్పకుండా ఎంజాయ్ చేస్తారు' అని అన్నారు. నిర్మాత రాజేశ్ దండా మాట్లాడుతూ' ప్రతి ఒక్కరికీ ఈ సినిమా నచ్చుతుంది. రీతు వర్మ డ్యాన్స్ అదరగొట్టింది' అని అన్నారు.

మాఫియాతో పోలీస్ పోరాటం



సంఘ విద్రోహ శక్తుల ఆటకట్టించే పోలీసాఫీసర్ కథతో తెరకెక్కుతోన్న చిత్రం 'విద్రోహి'. రవి ప్రకాశ్ ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. వీఎస్‌వీ దర్శకత్వంలో వీ వెంకట సుబ్రహ్మణ్యం, పీ కనకదుర్గారావు నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను నటుడు శ్రీకాంత్ చేతుల మీదుగా యూనిట్ విడుదల చేసింది. రవి ప్రకాశ్ మాట్లాడుతూ 'ఇదొక సస్పెన్స్ థ్రిల్లర్. కథలో ఊహించని మలుపులు ప్రేక్షకులను థ్రిల్ చేస్తాయి. దర్శకుడిగా వీఎస్‌వీకి పేరు తెస్తుంది' అన్నారు. ఒక తెలివైన పోలీసు మాఫియాను మట్టుబెట్టిన తీరు ప్రేక్షకులను అలరిస్తుందని నిర్మాతలు చెప్పారు. సంగీతం: భీమ్స్ సిసిరోలియో, సినిమాటోగ్రఫీ: సతీశ్ ముత్యాల.



సోమేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాట్లు

మహా శివరాత్రి ఉత్సవాలు ప్రారంభం

పాలకొల్లు అర్బన్/ భీమవరంటౌన్ / ద్వారకా తిరుమల,ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మహాశివ రాత్రికి ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. పంచారామ క్షేత్రమైన క్షీరా రామ లింగేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం మహా శివరాత్రి ఉత్సవాలు ప్రారంభ మయ్యాయి. ఉదయం స్వామివారికి ప్రత్యేకంగా అభిషేకాలు, పూజలు నిర్వహించారు. రుద్రహోమం, సాయంత్రం స్వామివారికి ముత్యాల పూజలు, అనంతరం స్వామివారి లీలా కల్యాణం నిర్వహించారు.

గునుపూడిలో నేటి నుంచి కల్యాణోత్సవాలు

గునుపూడిలోని సోమేశ్వరస్వామి వారి పంచ రాత్ర కల్యాణ మహోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు, ఏకాదశ రుద్రాభిషేకాలు, లక్షపత్రి పూజ, లక్ష కుంకుమార్చన నిర్వహిస్తారు. సాయంత్రం ధ్వజారోహణ నిర్వహిస్తారు. 26 బుధవారం స్వామివారికి అభిషేకాలు దర్శనాలు ఉంటాయి. రాత్రి అఖండ దీపారాధన, రాత్రి 12-15 నిమిషాలకు స్వామివారికి మహానివేదన జరగుతుంది. అనంతరం స్వామివారి గ్రామోత్సవం, తెల్లవారుజామున స్వామివారికి, అమ్మవారికి కల్యాణ మహోత్సవం జరుగుతుంది. 27 గ్రామోత్సవం, సాయంత్రం రథోత్సవం జరుగుతుంది. 28 తేది ఉదయం నాచువారి సెంటర్‌నుంచి రథం తిరిగి ఆలయానికి చేరుకుంటుంది. రాత్రి 9 గంటలకు చంద్ర పుష్కరిణిలో తెప్పో త్సవం నిర్వహిస్తారు.

ద్వారకాతిరుమలలో వరుడైన శివదేవుడు

ద్వారకాతిరుమల క్షేత్రపాలకుడైన శివదేవుడు వరుడయ్యాడు. గంగా పార్వతి అమ్మవార్లు పెండ్లి కుమార్తెలుగా ముస్తాబయ్యారు. మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు శ్రీవారి దత్తత దేవాలయమైన శ్రీభ్రమరాంభ మల్లిఖార్జునస్వామి దేవాలయంలో ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ముఖమండపంలో ఏర్పాటు చేసిన వేదికపై ఏర్పాటు చేసిన సింహాసనంపై స్వామి, అమ్మవార్లను ఉంచి అర్చకులు అలంకరించారు. అనంతరం మేళతాళాలు, మంగళ వాయిద్యాలు అర్చకులు పండితుల వేదమంత్రోచ్చరణల నడుమ శివయ్య పెండ్లికుమారునిగా అమ్మవార్లను పెండ్లికుమార్తెలుగా చేశారు. సోమవారం ఉదయం వేదపారాయణలు, శివయ్యకు అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చన, రాత్రి విఘ్నేశ్వరపూజ, శైవ పుణ్యాహవాచన, పంచగవ్యప్రాసన, దీక్షాదారణ, యాగశాల ప్రవేశం, అగ్నిప్రతిష్టాపన, అంకురార్పణ, మండపార్చన, ధ్వజారోహణ, జరుగుతాయి.



క్షీరారామునికి అభిషేకాలు .. ద్వారకాతిరుమలలో స్వామి, అమ్మవార్లకు కల్యాణ పూజలు

26న సుదర్శన నృశింహ మహాయజ్ఞం

సుందరగిరిపై నేత్రపర్వంగా అంకురార్పణ

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): సుందరగిరిపై లక్ష్మీనారసింహుని ఆలయంలో ఆదివారం అతిరుద్ర ప్రయోగ సహిత సుదర్శన నృశింహ మహాయజ్ఞం ప్రారంభ కార్యక్రమాలు జరిగాయి. ఉదయం ఆలయ యాగశాలలో మహా గణపతి లక్ష మోదక హోమం పూర్తికావ డంతో వేదపండితులు, రుత్వికులు మహా పూర్ణాహుతి నిర్వహించారు. రాత్రి ధ్వజారోహణ జరిపారు. కలశ స్థాపనకు 1331 కలశాలను సిద్ధం చేశారు. యాగశాలలో వివిధ దేవ తామూర్తుల విగ్రహాలను ఉంచి దేవేరులకు పూజాధికాలు నిర్వహించారు. ఈనెల 26న జరు గునున్న మహాయజ్ఞ నిర్వహణకు ప్రధాన హోమ గుండాన్ని సుందరీకరిస్తున్నారు. ఈనెల 26 సాయంత్రం నుంచి తెల్లవార్లూ 31వ అతి రుద్రప్రయోగ సహిత సుదర్శన నృశింహ మహాయజ్ఞం జరుగుతుందని భక్తులు తరలి రావాలని నిర్వాహకులు నరసింహగురూజీ కోరారు.


మహా పూర్ణాహుతి నిర్వహిస్తున్న పండితులు

అక్షర వెలుగులు


జగన్నాథపురంలో ఉల్లాస్ కార్యక్రమంలో చదువుకుంటున్న మహిళలు

ఉల్లాస్ పేరుతో మహిళలకు చదువు
నిరక్షరాస్యులకు అక్షరజ్ఞానం
స్వయం సహాయక సంఘాల సభ్యులకు శిక్షణ

తాడేపల్లిగూడెం రూరల్ ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఇల్లాలి చదువు ఇంటికి వెలుగు.. ఈ సామెత ఎప్పటి నుంచో సమాజంలో నిరూపితమైనదే.. స్త్రీల చదువు సమాజ, సాంస్కృతిక ఉన్నతికి గీటురాయి. జనాభాలో సగం మందిని చదువుకు దూరం చేసిన పరిస్థితులను అధిగమించి బాలికా విద్య ఇప్పుడు అందరి ఆమోదం చూరగొంది. అయితే ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో మహిళల అక్షరాస్యత తక్కువే. ఈ నేపథ్యంలో నిరక్షరా స్యులైన మహిళలకు చదవడం, రాయడంతో పాటు డిజిటల్ లావాదేవీలు నిర్వహించేలా తీర్చిదిద్దేందుకు ఉల్లాస్ (అండర్ స్టాండింగ్ ఆఫ్ లైఫ్ లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ) పేరుతో వయోజన విద్యాశాఖ ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. మారుతున్న కాలానికి అనుగుణంగా వీరందరినీ అక్షరాస్యులను చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. స్వయం సహాయక సంఘాల్లోని నిరక్ష్యరాస్య మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడం దీని ప్రధాన లక్ష్యం. ఈ పథకం కింద ప్రాథమిక విద్యకు నోచుకోని వారిని, మధ్యలోనే బడి మానేసి అక్షరాలను మర్చి పోయిన వారిని గ్రామస్థాయిలో గుర్తించి వారిని అక్షరాస్యులుగా మార్చడమే ప్రభుత్వ ఉద్దేశం. అక్షరాస్యత అంటే కేవలం అక్షరం రానివారే కాకుండా అక్షరాస్యత ఉన్నా లెక్కలు తెలియని వారికి ఆర్థిక అక్షరాస్యత, సాంకేతికత అవసరం కోసం డిజిటల్ లిటరసీ నేర్పే విధంగా ఈ ఉల్లాస్ కార్యక్రమం సాగుతోంది.

మొదటి విడత 3,800 మందికి

పశ్చిమగోదావరి జిల్లాలో ఉన్న 19 మండ లాల్లో ఒక్కో మండలానికి 200 మంది చొప్పున 3,800 మందిని తొలివిడతగా గుర్తించి వారికి అక్షరాస్యత అందించే విధంగా ఈ ఉల్లాస్ కార్యక్రమం చేపట్టారు. దీంతో ఇప్పటికే గ్రామాల్లో డ్వాక్రాలో ఉత్సాహంగా ఉండి ఉన్నత చదువులు చదివిన వారిని ఉల్లాస్ వలం టీర్‌లుగా నియమించి మహిళలకు అక్షరాస్యత అందించే విధంగా ప్రణాళిక వేశారు.

ఉపయోగించుకుంటాం



సంతకం చేయడం తప్ప మరేమీ చద వలేం. ఈ వయసులో ఎవరినీ చదువు చెప్పండి అని అడగలేం. అలాగని చదువులేక ఎంతో ఇబ్బంది పడేవాళ్లం. మా కోసం ఇప్పుడు చదువుచెప్పే కార్యక్రమం చేపట్టడం ఎంతో ఉపయోగ కరంగా ఉంటుంది.ఈ అవకాశం ఉపయోగించుకుంటాం.

-ఓలేటి కృష్ణవేణి, జగన్నాథపురం

వడ్డీ లెక్కలు నేర్చుకుంటా



నాకు నోటి లెక్కలు బాగానే వస్తాయి. కానీ పేపర్‌పై రాసి లెక్కలు వేయాలంటే అస్సలు కుదరదు. ఈ అవకాశం ఉపయోగించుకుని వడ్డీ లెక్కలు, మామూలు లెక్కలు నేర్చుకుంటాను.

కొయ్య అరుణకుమారి, జగన్నాథపురం

చదువు ఎంతో అవసరం



చదువు నేటి సమాజంలో ఎంతో అవసరం. కానీ మా చిన్నతనంలో చదువుకునేందుకు కుదరలేదు. ఆ తరువాత పెళ్లి, పిల్లలు ఇలా జీవితం గడిచి పోయింది. గతంలో వయోజన విద్య అని చదువు చెప్పేవారు. తరువాత ఆ కార్యక్రమమే లేదు. కూటమి ప్రభుత్వం చదువు మహిళలకు చెప్పాలనే ఆలోచన బాగుంది.

ముప్పిడి రత్నకుమారి, జగన్నాథపురం




ద్వారకాతిరుమల మెట్లదారిలో చల్లనీరు వదులుతున్న దృశ్యం.. ఆకివీడులో ఎండదెబ్బకు ఇలా..

అమ్మో..! అప్పుడే ఎండ మంటలు

పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

ఆకివీడు/ ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): భానుడు భగభగలతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. రోజురోజుకూ ఎండలు పెరుగుతున్నాయి. ఉదయం నుంచే ఎండ తీవ్రత ఎక్కు వగా ఉండడంతో జనం ఆందోళన చెందుతున్నారు. ఫిబ్రవరిలోనే ఇలా ఉంటే రానున్న రోజుల్లో ఎలా ఉంటాయని భయపడుతున్నారు. ప్రజలు బయటకు వస్తే నెత్తికి టోపీలు, ముఖాలకు గుడ్డలు, కళ్ళజోడ్లు, గొడుగులు వేసుకొని వస్తున్నారు. వ్యాపా రస్థులు మధ్యాహ్న సమయంలో బేరాలు లేకపోవడంతో దుకాణాలు మూసివేస్తున్నారు. ఎండలు అప్పుడే సుర్రుమనడంతో చినవెంకన్న క్షేత్రానికి వచ్చే భక్తుల రక్షణకు దేవస్థానం చర్యలు చేపట్టింది. ఆలయంలో భక్తులు ఎక్కువగా సంచరించే కూడళ్లలో టెంట్‌లను ఏర్పాటు చేశారు. ప్రధాన రాజగోపుర రాతి మెట్లదారి గుండా ఆలయానికి రాకపోకలు సాగించే వారి కోసం నీటిని వదులుతున్నారు. దీంతో మెట్లు వేడిగా ఉండకుండా చల్లగా ఉండ టంతో భక్తులు ఎండ బారిన పడకుండా ఉపశమనం పొందుతున్నారు. ఆలయ ప్రాంగణంలో తివాచీలు వేశారు. అదే విధంగా ఆలయం బయట సంచరించే యాత్రికుల కాళ్లు కాలకుండా పాదాల రక్షణకు గాను కూల్ పెయింట్‌లు వేశారు.


ద్వారకాతిరుమలలో భక్తుల కోసం వేసిన టెంట్లు

ఉద్యోగ, సర్వీసు ఓటర్లకు పోస్టల్ బ్యాలెట్ సిద్ధం

438 మందికి పోస్టు ద్వారా బట్వాడా

ఏలూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): తూర్పు- పశ్చిమగోదావరి జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి విధుల్లో ఉన్న ఉద్యోగ, సర్వీసు ఓటర్లకు మొత్తం 438 మంది పోస్టల్ బ్యాలెట్‌లను అధికార యంత్రాంగం సిద్ధం చేసింది. దరఖాస్తు చేసు కున్న వారందరికి ఓటు హక్కును ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.వెట్రిసెల్వి అవకాశం కల్పించారు. వీరందరికి ఈ నెల 26వ తేదీలోగా బ్యాలెట్ పంపిణీ చేయాలని నిర్ణయించారు. వారి అడ్రస్‌కు పోస్టల్ సర్వీసు ద్వారా బ్యాలెట్‌లను పంపడంతో పాటు, వారు ఓటు వేశాక తిరిగి వేరొక కవర్‌లోనే జిల్లా కలెక్టరేట్ పోస్టల్ బ్యాలెట్ కేంద్రానికి లేదా కౌంటింగ్ కేంద్రానికి మార్చి 3వ తేదీ ఉదయం 7 గంటల్లోగా చేరాలని డెడ్‌లైన్ పెట్టారు. ఓటేసిన వారు వ్యక్తిగతంగానైనా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన డ్రాప్ బాక్సులో వేయచవచ్చునని అధికారులు చెబుతున్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్లు కూడా కీలకం కావ డంతో, వీరు ఓటు ఎవరికి పడుతుందోనన్న ఆసక్తి నెలకొంది.

అథ్లెటిక్స్‌లో సీనియర్ సిటిజన్ సత్యనారాయణ సత్తా

తణుకు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : పోటీ ఏదైనా పతకం రావాల్సిందే. గత ఆరు సంవత్సరాల నుంచి సీనియర్ సిటిజన్స్ అథ్లెటిక్స్‌లో పాల్గొంటూ సత్తా చాటుతున్నారు తణుకు పట్టణానికి చెందిన సత్యనారాయణ (87). ఈనెల 7 నుంచి 9 వరకు అనంతపురంలోని మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలలో మూడు ఈవెంట్లులో హేమర్‌త్రో, షాట్‌పుట్, జావెలిన్‌త్రో పోటీలలో గోల్డ్‌మెడల్, ప్రశంసా పత్రాలు సాధించారు. సత్యనారాయణ గత ఆరు సంవత్సరాలుగా సీనియర్ సిటిజన్స్ విభాగంలో (80-85) అనేక పోటీల్లో పాల్గొని పతకాలు సాధించారు. ప్రతి యేటా అసోసియేషన్ తరుపున ఏదో ఒక ముఖ్య పట్టణంలో పోటీలు నిర్వహించారు. ఇప్పటి వరకు శ్రీకాకుళం, తిరుపతి, విశాఖపట్టణం, గుంటూరు, అనంతపురం, కడప వంటి ప్రాంతాల్లో పోటీలు నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో నిర్వహించిన అన్ని పోటీల్లో పాల్గొని 19 మెడల్స్ సాధించారు.


పతకం అందుకుంటున్న సత్యనారాయణ


ఏలూరు వైఎంహెచ్ఏలో జరుగుతున్న నాటకోత్సవాల్లో ప్రదర్శించిన "సారీ రాంగ్ నంబర్" నాటకంలోని ఒక సన్నివేశం

సందేశాత్మకంగా నాటికలు

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఏలూరు వైఎంహెచ్ఏ ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన నాటిక పోటీలు కళాప్రియులను ఆకట్టుకున్నాయి. సమాజానికి సందేశాన్ని ఇస్తూ ఆలోచింపచేసే విధంగా ప్రదర్శనలు సాగాయి. గరికపాటి ఆర్ట్స్ థియేటర్ ఆధ్వర్యంలో నాటకోత్సవాల్లో భాగంగా రెండోరోజు నాటిక పోటీలను కళారత్న కె.వి సత్యనారాయణ, ప్రముఖ సినీ రచయిత పి.రాజేంద్రకుమార్, విద్యావేత్త మైలవరపు బాల సుబ్రహ్మణ్య శర్మ ప్రారంభించి మాట్లాడారు. కళలను, కళారంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. రెండోరోజు కాకినాడ సాయికార్తిక్ క్రియేషన్స్ కళాకారులు ఎడారిలో వానచినుకు ప్రదర్శించారు. సురేష్ తన తల్లిదండ్రులు శారదమ్మ, సుందరయ్యను వృద్ధాశ్రమంలో వదిలేస్తాడు. అమెరికా నుంచి వచ్చిన మనోజ్ వారిని తల్లిదండ్రులుగా దత్తత తీసుకోవాలనుకుంటాడు. అయితే సురేష్ వారిని రూ.25 లక్షలకు బేరం పెడతాడు. దీంతో ఆగ్రహించిన ఆ తల్లిదండ్రులు తీసుకున్న నిర్ణయమే ఈ నాటిక ప్రధాన అంశం. కళాకారుల నటన ఆకట్టుకుంది. ఈ నాటికను శారద, ప్రసన్న రచించగా సిహెచ్ మహేష్ దర్శకత్వం వహించారు. మానవ సంబంధాలు కనుమరుగై డేటింగ్‌లు, చాటింగ్‌లు, క్లబ్‌లు, పబ్‌లు సహజీవనం అంటూ భ్రష్టుపట్టిపోతున్న నేటి వ్యవస్థలో కొడుకును కాపాడుకోవడానికి ఒక తండ్రి పడిన ఆరాటం కాపురాన్ని నిలబెట్టుకోవడానికి ఒక ఇలాలు చేసిన పోరాటం ఇతివృత్తంగా సాగిన 'సారీ రాంగ్ నంబర్' నాటిక కళాప్రియులను ఆకట్టుకుంది. రచన చింతన మల్లేశ్వర రావు, మహ్మద్ ఖాజావలీ దర్శకత్వం వహించారు. భగవంతుడు ఇచ్చిన చిన్న జీవితాన్ని హాయిగా, ఆనందంగా జీవించకుండా కుళ్ళు, కుతంత్రాలతో గడి పేయడం అవసరమా అంటూ 'మరీ అంతవద్దు' నాటిక హాస్యభరితంగా సాగింది. ఆకురాతి భాస్కర్‌చంద్ర రచించగా నడింపల్లి వెంకటేశ్వరరావు దర్శకత్వం వహించారు. గరికపాటి కాళిదాసు, ఎమ్డీ ఖాజావలీ పర్యవేక్షించారు.


స్వాధీనం చేసుకున్న సొత్తుతో పోలీసు అధికారులు

చోరీలకు పాల్పడుతున్న ఐదుగురి అరెస్ట్

రూ.10.20 లక్షల విలువైన సొత్తు స్వాధీనం

భీమవరం క్రైం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) :భీమవరం సబ్ డివిజనల్ పరిధిలో దొంగతనాలకు పాల్పడుతున్న ఐదుగురు నిందితులతో పాటు ఒక బాల నేరస్తుడిని అరెస్ట్ చేసి రూ. 10 లక్షల 20 వేల విలువ గల సొత్తు స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా అడిషనల్ ఎస్పీ వి.భీమారావు తెలిపారు.వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం వివరాలను వెల్లడించారు. భీమవరం సబ్ డివిజన్‌లోని వివిధ పోలీస్ స్టేషన్లలో 11 కేసుల్లో ఉన్న ఐదుగురు నిందితులు, ఒక బాలుడిని అరెస్ట్ చేశామన్నారు. భీమవరం వన్‌టౌన్, ఉండి, భీమవరం రూరల్, ఆకివీడు పోలీస్ స్టేషన్లకు సంబంధించి వారిపై పలు కేసులు ఉన్నాయ న్నారు. భీమవరం మండలం రాయలం గ్రామానికి చెందిన అనుపోజు కృష్ణవంశీ, చాగల్లు గ్రామం జుట్టావారి వీధికి చెందిన డొక్కు సాయికిరణ్, ఆకివీడు మండలం తాళ్ళకోడు గ్రామానికి చెందిన నరమామిడి హరిబాబు అలియాస్ హరీష్, భీమవరం మండలం డేగాపురం గ్రామానికి చెందిన ఓలేటి దుర్గామల్లేశ్వరరావు, భీమవరం బడుగు వారి వీధికి చెందిన దగరపు ఎలియాజర్, ఒక జువైనల్ బాలుడిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 12 మోటార్ సైకిళ్లతో పాటు బంగారం, వెండి నగదు మొత్తం రూ. 10 లక్షల 20 వేల సొత్తు స్వాధీనం చేసుకున్నామన్నారు. భీమవరం డీఎస్పీ జయసూర్య ఆధ్వర్యంలో సీఐలు నాగరాజు, జగదీశ్వరరావు, ఎస్ఐలు కిరణ్‌కుమార్, వీర్రాజు, నాగరాజు, నజీరుల్లా, సిబ్బంది బృందాలుగా ఏర్పడి సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి వారిని అరెస్ట్ చేశారన్నారు. అనుపోజు కృష్ణవంశీపై భీమవరం వన్‌టౌన్, టూటౌన్, భీమవరం రూరల్, ముదినేపల్లి, మండవల్లి, కైకలూరు పోలీస్ స్టేషన్లలో పలు చోరీ కేసులు ఉన్నాయన్నారు. డొక్కు సాయికిరణ్‌పై కాళ్ళ పోలీస్ స్టేషన్‌లో గంజాయి కేసు, ఉండి, పాలకోడేరు పోలీస్ స్టేషన్లలో

క్రైమ్ కార్నర్

చోరీ కేసులు ఉన్నాయన్నారు. నరమామిడి హరిబాబు అలియాస్ హరీష్‌పై భీమవరం వన్‌టౌన్, వీరవాసరం పోలీస్ స్టేషన్లలో బ్యాగు దొంగతనాల కేసులు ఉన్నాయన్నారు. సమావేశంలో భీమవరం డిఎస్‌పి జయసూర్య, వన్‌టౌన్ సీఐ నాగరాజు, ఆకివీడు సీఐ జగదీశ్వరరావు, భీమవరం ఎస్ఐ బివై కిరణ్‌కుమార్, రూరల్ ఎస్ఐ వీర్రాజు, ఆకివీడు ఎస్ఐ నాగరాజు, ఉండి ఎస్ఐ నజీరుల్లా, సిబ్బంది ఉన్నారు.

విద్యార్థిని ఆత్మహత్య

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): పెద్దలు మందలించారనే క్షణికోద్రేకంతో విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన నూజివీడులో చోటుచేసుకుంది. వివరాల ప్రకారం నూజివీడు పట్టణం బాపూనగర్‌కు చెందిన బి.వెంకటరమ్య (18) పెద్దలు మందలించారనే కారణంతో ఇంట్లో ఉరి వేసుకుని శనివారం ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించింది. దీన్ని గమనించిన కుటుంబసభ్యులు రమ్యను నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. నూజివీడు పట్టణ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టంకు పంపి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాముకాటుకు ఒకరి మృతి

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : ఒక వ్యక్తిని పాముకాటు వేయడంతో ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆకివీడు మండలం నందవల్లిపాడు గ్రామానికి చెందిన కొలవల సూరయ్య (55)ను ఈనెల 22వ తేదీన పాము కాటు వేయడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. అతనిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకురాగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆకివీడు పోలీసులు ఏలూరు చేరుకుని మృత దేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

రొట్టె కోసం వృద్ధ దంపతుల గొడవ
మనస్థాపానికి గురైన భర్త ఆత్మహత్య

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : ఎనిమిది పదులు నిండిన వృద్ధ దంపతులు ఉదయం టీతో పాటు రొట్టె తినే సమయంలో రొట్టె కోసం గొడవపడ్డారు.తీవ్ర మనస్థాపానికి గురైన భర్త పురుగు మందు తాగడంతో ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో తీసుకు వెళ్లారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాళ్ళ మండలం సత్యనారాయణపురానికి చెందిన రేపాల నాగేశ్వర రావు (84)కు అతని భార్య (80), ముగ్గురు కుమారులు ఉన్నారు. ముగ్గురు కుమారులు నెలకు ఒకరు వంతున భోజనాల పెడుతూ ఉంటారు. ఈనెల 21వ తేదీ ఉదయం టీ, రొట్టెలను తీసుకు వచ్చి పెద్ద కుమారుడు ఇచ్చారు. వారిద్దరు తినే సమయంలో రొట్టె కోసం గొడవపడ్డారు. దీంతో నాగేశ్వర రావు తీవ్ర మన స్థాపానికి గురయ్యాడు. సమీపంలోని పొలం వద్దకు వెళ్ళి కలుపు మందు కలిపి ఉన్న నీళ్ళను తెచ్చుకుని ఇంటి వద్ద తాగేశాడు. ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకురాగా చికిత్స పొందుతున్న అతను ఆదివారం మృతి చెందారు. ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృత దేహానికి పోస్టు మార్టం నిమిత్తం ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

ఆసుపత్రిలో అగ్నిప్రమాదం.. రూ.3.50 లక్షల ఆస్తి నష్టం



ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 23 (ఆంధ్ర జ్యోతి) : సోలార్ యూపీఎస్ బోర్డు వద్ద విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల జరిగిన అగ్ని ప్రమాదంలో రూ.3.50 లక్షలు నష్టం సంభవించింది. ద్వారకాతిరుమల మండలం ఎం.నాగులపల్లి పంచాయతీ ద్వారకానగర్ పరిధిలో భీమడోలు జంక్షన్‌లో ఉన్న డాక్టర్ బాలు ఆసుపత్రిలో ఆదివారం మధ్యాహ్నం ఈ ఘటన జరిగింది. మంటలు వ్యాపించి పొగలు దట్టంగా రావడంతో స్థానికులు బెంబే లెత్తారు. అగ్నిమాపక సిబ్బంది వెంటనే మంటలను అదుపులోకి తేవడంతో పెను ప్రమాదం తప్పింది. సోలార్ సిస్టమ్ దగ్ధం కావడంతో దాదాపు రూ.3.50 లక్షలు నష్టం సంభవించినట్లు భీమడోలు ఫైర్ అధికారి నాగరాజు తెలిపారు.

కళ్లల్లో కారం కొట్టి 2.41 లక్షలు చోరీ

ఏలూరులో ఘటన

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : ఒక కాస్మోటిక్స్ కంపెనీకి కలెక్షన్ ఎగ్జిక్యూటివ్‌గా ఉన్న వ్యక్తి సొమ్ములను వసూలు చేసుకుని తిరిగి వెళ్తుండగా మార్గమధ్యలో గుర్తు తెలియని ఇద్దరు యువకులు ఆపి ఫోన్ అడిగి ఆపై అకస్మాత్తుగా కళ్ళల్లో కారం కొట్టి నగదు బ్యాగ్‌ను అపహరించుకుపోయారు. ఈ సంఘటన ఏలూరు నగరంలో ఈనెల 22వ తేదీ రాత్రి జరిగింది. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిడదవోలుకు చెందిన గొట్టాల వీరేష్ (40) ఏలూరులోని ఒక హోటల్‌లో ఉంటున్నాడు. ఒక కాస్మోటిక్స్ వస్తువుల తయారీ కంపెనీ హోల్‌సేల్ డీలర్ వద్ద కలెక్షన్ ఎగ్జిక్యూ టివ్‌గా పని చేస్తున్నాడు. వివిధ షాపుల నుంచి వారాంతపు వసూలు కోసం శనివారం ఏలూరు నగరానికి వచ్చి సొమ్ములను వసూలు చేసుకు న్నాడు. మొత్తం రెండు లక్షల 41 వేల 600 రూపాయల నగదును రాత్రి 11.30 గంటల తరువాత బ్యాగ్‌లో పెట్టుకుని వన్‌టౌన్ ప్రాంతం నుంచి టూటౌన్ ప్రాంతానికి వెళ్ళేందుకు కాంగ్రెస్ కార్యాలయం వద్ద అగ్రహారం రోడ్డులో వెళ్తున్నాడు. ఇద్దరు వ్యక్తులు మోటారు సైకిల్‌పై వచ్చి ఫోను ఇవ్వాలని ఆపారు. అతను ఆగిన వెంటనే కళ్ళల్లో కారం కొట్టి బ్యాగ్ అపహరించు కుపోయారు. అతను తేరుకుని అటుగా వెళ్ళే వారి సహకారంతో ముఖం కడుక్కుని ఆ తరువాత పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఏలూరు వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీ సులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఏలూరు నగరంలో ఇలాంటి సంఘటనలు వన్‌టౌన్ ప్రాంతంలో అనేకం జరిగాయి. కొద్ది నెలల క్రితమే ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఇద్దరు యువకులు ఏలూరు నగరంలో ఉంటూ ఈ నేరాలకు పాల్పడడంతో వారిని కూడా అరెస్టు చేశారు. ఇలాంటి ఈ నేరాలకు పాల్పడుతున్న యువకులను అరెస్టు చేసేందుకు ప్రత్యేక బృందాలను కూడా రంగంలోకి దింపారు.

రెండు కేసుల్లో 9 మంది అరెస్టు
ఆరుగురు జువైనల్స్

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : షాపులు పగులగొట్టి చోరీలకు పాల్పడుతున్న ఒక యువకునితో పాటు ఐదుగురు జువైనల్స్‌ను అరెస్టు చేశారు. మరో కేసులో ఇద్దరు యువకులతో పాటు ఒక జువైనల్‌ను కూడా ఏలూరు త్రిటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. ఏలూరు శనివారపుపేట గాలిగోపురం సమీపంలోని షాపులను వరుసగా పగులగొట్టి ఇటీవల చోరీలకు పాల్పడ్డారు. ఈ సంఘటనపై ఏలూరు త్రిటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్ ఆదేశాల మేరకు త్రి టౌన్ సీఐ కోటేశ్వరరావు, ఎస్ఐ రాంబాబు వారి సిబ్బంది కలిసి ప్రత్యేక బృందాలుగా ఏర్పడి గాలింపు చేపట్టారు. ఈ నేరాలకు పాల్పడిన ఏలూరు పాముల దిబ్బనకు చెందిన దొడ్డిగర్ల రవికిషోర్ (30), మరో ఐదుగురు బాల నేర స్తులను అరెస్టు చేశారు. వారి నుంచి అపహ రణకు గురైన సిగరెట్ పెట్టెలు, నగదు, చాక్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. నూతనంగా నిర్మాణం అవుతున్న ఇంటి వద్ద ఉంచిన కరెంటు వైర్లను దక్షిణపు వీధినకు పేతూరి గణేష్ (19), ఏలూరు రూరల్ మండలం మాదేపల్లినకి చెందిన త్రిపాలి నరేంద్ర (19)లతో పాటు మరో బాల నేరస్తుడిని అరెస్టు చేశారు. వీరి నుంచి చోరీకి గురైన విద్యుత్ వైర్లను స్వాధీనం చేసుకున్నారు.

జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సస్పెన్షన్

ముదినేపల్లి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : ముదినేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జాస్మిన్ సస్పెండ్ అయ్యారు. ఈ మేరకు ఇటీవల ఇంటర్మీడియట్ బోర్డు రీజనల్ జాయింట్ డైరెక్టర్ శారద ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఏడాది జనవరి 4న ఆ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ప్రారంభోత్సవ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ఆమె ఆలస్యంగా రావడం, నిర్వహణ పట్టించుకోకపోవడం, ఎన్డీఏ నాయకుల పట్ల ఆమె ప్రవర్తించిన తీరుపై ఆర్జేడీకి సమాచారం పంపడంతో ఆమె కృష్ణాజిల్లా ఇంటర్మీడియట్ విద్య అధికారి సాల్మన్‌రాజుతో పై అంశాలపై ఇటీవల విచారణ జరిపించారు. అప్పటికే ఆమె ఈ ఆరోపణలతో రాజమండ్రిలోని ఆర్‌జెడి కార్యాలయానికి ఎటాచ్‌మెంట్‌లో ఉన్నారు. విచారణ అధికారి అందజేసిన పూర్తి స్థాయి నివేదికను పరిశీలించిన అనంతరం ఆమెను ఆర్జేడీ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఆ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్‌గా సత్యనారాయణమూర్తి కొనసాగుతున్నారు.

ఆధ్యాత్మిక చింతనతో జీవించండి : ఎమ్మెల్యే చంటి

ఏలూరుటూటౌన్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనతో జీవించాలని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. బీడీ కాలనీలో నూతనంగా నిర్మించిన ఆలయంలో శ్రీమహాగణపతి, శ్రీసీతారామ చంద్రస్వామి, శ్రీకనకదుర్గ అమ్మవారి విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ మహోత్సవాన్ని ప్రధాన అర్చకులు శ్రీనివాస్ వైభవోతంగా నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఆర్.చిన్నారావు, లక్ష్మణరావు, నాగరాజు, వీ.శ్రీనివాసరావు, ఎం.శివయ్య, రమణ, చోడే వెంకటరత్నం నిర్వహించారు.

మిర్చి రైతుల సమస్యలు పరిష్కరించాలి : శ్రీనివాస్

ఏలూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి) : కష్టాల్లో ఉన్న మిర్చి రైతుల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం అన్నే భవనంలో మిర్చి రైతుల సమస్యలపై చర్చలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిర్చి రైతులు తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నా రని, క్వింటాలుకు 11 వేల 781 రూపాయల ధరను నిర్ణయించడం సరికాదన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

పెదపాడు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి అనూరాధ సూచించారు. పెదపాడు మండలం అప్పనవీడులో స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా పంచాయతీ సిబ్బందితో కలిసి ఇంటింటికి వెళ్లి పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. పారిశుధ్య కార్మికులు ఇంటింటికీ వచ్చి చెత్తను సేకరిస్తారని, రోడ్లపై ఎక్కడా వేయవద్దని గ్రామస్థులకు డీపీవో సూచించారు. ప్రభుత్వ ఆశయం మేరకు ప్రతి ఒక్కరూ స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని విధిగా పాటించాలని విజ్ఞప్తి చేసి కరపత్రాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో ఈవో పీఆర్డీ సూర్య కుమార్, తదితరులు పాల్గొన్నారు.

జోరుగా ఎమ్మెల్సీ అభ్యర్థుల సెల్‌ఫోన్ ప్రచారం

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక ఈనెల 27వ తేదీన జరుగనున్న నేపథ్యంలో పోటీలో ఉన్న అభ్యర్థుల ప్రచారం జోరందుకుంది. ఓటర్ల సెల్‌ఫోన్ నెంబర్లు సేకరించి ఐవీఆర్ సిస్టమ్ ద్వారా కాల్స్‌ను చేయిస్తున్నారు. రోజుకు ఇలాంటి ఫోన్లు 10 వరకూ వస్తున్నాయంటూ ఓటు ఉన్న పట్టభద్రులు చెబుతున్నారు. అంతే కాకుండా ఐవీఆర్ సిస్టమ్ ద్వారా సర్వే కూడా చేస్తున్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలో ప్రధానం ఇద్దరు అభ్యర్థుల పేర్లు చెప్పి ఈ సర్వే చేస్తున్నారు. ఈ విధంగా ఓటర్లకు ఫోన్లు నిత్యం వస్తూనే ఉన్నాయి.

ముద్దప్పగూడెంలో సారా నిర్మూలనపై అవగాహన

బుట్టాయగూడెం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి) : పోలవరం ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని బుట్టాయగూడెం మండలం ముద్దప్పగూడెం గ్రామంలో నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా సారా నిర్మూలనపై ఆదివారం అవగాహన సదస్సును నిర్వహించారు. సీఐ కె.వీరబ్రహ్మం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సారా నిర్మూలన కోసం నవోదయం 2.0 కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కుంజా దుర్గమ్మ, ఎస్సై సునీల్ కుమార్, ఏలూరు ఎన్‌ఫోర్స్ మెంట్ సీఐ ఫణి కుమార్ పాల్గొన్నారు.

చింతలపూడిలో దేహదారుఢ్య పోటీలు ప్రారంభం

చింతలపూడి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి) : చింతలపూడిలోని ఫైర్ స్టేషన్ సెంటర్‌లో దేహదారుఢ్య పోటీలను ఎంపీ మహేష్ కుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ మాట్లాడుతూ మిస్టర్ ఆంధ్ర ఓపెన్ బాడీ బిల్డింగ్ చాంపియన్ షిప్-2025 పోటీలు ఇక్కడ ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. ఇలాంటి పోటీలు ఈ ప్రాంతంలో పెట్టడం అరుదైన విషయమన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ఈ పోటీల్లో క్రీడాకారులు పాల్గొన్నారని, గెలుపొందిన వారికి నగదు బహుమతులు అందజేశారు. ఈ ప్రాంతంలో ఈ పోటీలు నిర్వహించినందుకు నిర్వాహకులు దిలీప్‌ను పలువురు అభినందించారు.

ఏడుగురు వ్యక్తులపై కేసు నమోదు

టి.నరసాపురం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి):కోడిపందేలు నిర్వహిస్తున్న ఏడుగురిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై ఎం.జయబాబు తెలిపారు. టి.నరసాపురం పంచాయతీలోని కృష్ణాపురం గ్రామ శివార్లలో కోడి పందేలు ఆడుతున్నారనే సమాచారంతో తన సిబ్బందితో ఆదివారం దాడిచేసి నిర్వాహకుల నుంచి 13 వేల నగదు, కోడి పుంజు, కోడికత్తి స్వాధీనం చేసుకుని ఏడుగురిపై కేసు నమోదు చేసినట్టు ఆయన తెలిపారు.

శ్రీరాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు

పెదవేగి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి) : రాట్నాలకుంట శ్రీరాట్నాలమ్మ వారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని, పూజలు జరిపారు. అమ్మవారికి పాలపొంగలి నైవేద్యం సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు పావులూరి వీరవెంకట రామసత్యనారాయణశర్మ, రుద్రపాక మోహన దుర్గా శేషగిరిరావు, పావులూరి పూర్ణయ్యశర్మ, చావలి సాయి అమ్మవారికి లలితా సహస్రనామ దేవీ ఖడ్గమాలార్చన పూజలు నిర్వహించారు.

విశిష్ట నమోదు కేంద్రాల పరిశీలన

ఏలూరు/చింతలపూడి/టి.నరసాపురం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): సొంత భూమి కలిగిన ప్రతి రైతు తప్పని సరిగా పదకొండు అంకెల విశిష్ట సంఖ్యను నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా సూచించారు. ఆదివారం జంగారెడ్డిగూడెం సహాయ వ్యవసాయ సంచాలకుల కార్యాలయం లో జరిగిన విశిష్ట నమోదు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కేఆర్‌పురం సహాయ వ్యవసాయ సంచాలకుడు పి.జి.బుజ్జిబాబు మాట్లాడుతూ రైతులంతా విశిష్ట సంఖ్యను నమోదు చేయించుకోవాలని అన్నారు. టి.నరసాపురం, బొర్రం పాలెం గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలను జిల్లా వ్యవసాయ అధికారి షేక్ హబీబ్ బాషా ఆదివారం సందర్శించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారిణి సుమలత పాల్గొన్నారు. చింతలపూడి మండల వ్యవసాయ శాఖాధికారిణి మీనా కుమారి స్థానిక రైతు సేవా కేంద్రాన్ని సందర్శించి విశిష్ట సంఖ్య నమోదు గురించి వివరించారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల అందజేత

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి) : ప్రముఖ వ్యాపారవేత్త నారా శేషు ఏలూరు కాపు, తెలగ, బలిజ, ఒంటరి సంఘం ఆధ్వర్యంలోని విద్యానిధికి లక్షా 116 వేలు అందజేశారు. ఈ విద్యానిధి రూపంలో ఉన్న డిపాజిట్‌పై వచ్చిన వడ్డీ మొత్తం రూ.78 వేలు ఇంటర్మీడియట్‌లో అత్యధిక మార్కులు సాధించిన 26 మంది కాపు పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల రూపంలో ఆదివారం అసోసియేషన్ కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు జెట్టి సింహాద్రిరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నిర్వాసితుల పరిహారంపై దళారుల చూపు

కుక్కునూరు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా ముంపుకు గురవుతున్న నిర్వాసితులకు ప్రభుత్వం కోట్లాది రూపాయల పరిహారం జమ చేసింది. నిర్వాసితుల వ్యక్తిగత పరిహారం కోల్పోతున్న ఇళ్లకు నిర్వాసితుల ఖాతాలో సొమ్ము జమ అయ్యింది. ఈ పరిహారాన్ని కుటుంబ సభ్యులు పంచుకోవడంపై ఘర్షనలు, గొడవలు తలెత్తుతున్నాయి. కొందరు దళారులు మధ్యవర్తిత్వం వహిస్తూ లక్షలాది రూపాయలు కాజేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. 41.15 కాంటూరు లేవిల్ ఉన్న గ్రామాలను ముంపులో చేర్చాలంటే ఖర్చవుతుందని, డబ్బులు ఇవ్వకపోతే పని జరగదని, పరిహారం కూడా రాకుండా పోతుందని ఓ దళారి అక్రమాలకు తెర తీశాడని పలువురు వాపోతున్నారు. ఇది ఇలా ఉండగా ఓ వ్యక్తికి పరిహారం మంజూరైన క్రమంలో పంపకాల్లో తేడా వచ్చిన విషయంలో ఓ అధికారి ఫోన్ చేశారనే ప్రచారం మండలంలో ప్రచారం జరుగుతోంది. సదరు అధికారి ఫోన్ చేశాడా లేదా ఫోన్ చేస్తే ఏ మాట్లాడారనేది ఉన్నతాధికారుల విచారణలో తేలనుంది. దీనిపై ఇప్పటికే ఉన్నతాధికారులు ఇంటిలిజెన్స్ రిపోర్టు వెళ్ళినట్లు సమాచారం.

పరిష్కరించుకోమని చెప్పాను : రాములు నాయక్, ఐటీడీఏ పీవో

కుక్కునూరు మండలం చీరవల్లి గ్రామానికి చెందిన ఓ ఇంటి వల్యూకు సంబంధించి నగదు మంజూరైంది. అయితే మాచర్ల వెంకటేశ్వర్లు, జట్టి రామచంద్రరావు అనే ఇద్దరు వ్యక్తులు వచ్చి ముత్తంశెట్టి ప్రసాద్ అనే వ్యక్తి మాకు డబ్బులు సరిగా ఇవ్వడంలేదని ఫిర్యాదు చేశారు. దీంతో ప్రసాద్‌కు ఫోన్ చేసి వచ్చిన డబ్బులు సక్రమంగా పంచుకుని సమస్యను పరిష్కరించుకోవాలని మాత్రమే చెప్పాను.. ఏ నాయకుడి వద్దకు కానీ సెటిల్ మెంట్‌కు కానీ వెళ్ళాలని చెప్పలేదు.

రాఘవులును గెలిపించాలంటూ సీపీఐ ప్రచారం

కామవరపుకోట, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి) : కార్మిక సంఘాలు బలపరిచిన దిడ్ల రాఘవులును ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికల్లో గెలిపించాలని కోరుతూ సీపీఐ మండల కార్యదర్శి టి.వి.రాజు ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ ప్రజా సమస్యలను, కార్మిక, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించగల సామర్థ్యం రాఘవులుకు ఉందని అన్నారు. అందుకే తొలి ప్రాధాన్యత ఓటు వేసి ఎమ్మెల్సీగా గెలిపించాలంటూ పట్టభద్రులను అభ్యర్థించారు. కార్యక్రమంలో ఎ.రవి, తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మకుమారీస్ ర్యాలీ

ఏలూరు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి) : పట్టిసీమ మహాశివరాత్రి ఉత్సవాలు 26వ తేదీ నుంచి జరగనున్న నేపథ్యంలో ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వ విద్యాలయం సభ్యులు ఆదివారం బ్రహ్మకుమారీస్ సమాజం వద్ద శివ జయంతిని నిర్వహించారు. అనంతరం పోలవరంలో శివలింగం ఏర్పాటు చేసిన వాహనంతో ర్యాలీ నిర్వహించారు. దీప మహోత్సవం, శివపతాకా విష్కరణ చేశారు.

పట్టుకోండి చూద్దాం..

నగరంలోకి యథేచ్ఛగా భారీ వాహనాలు

ట్రాఫిక్ పోలీసుల తీరుపై విమర్శలు

కట్టడి చేయాలంటూ పలువురి విజ్ఞప్తి



ఏలూరు క్రైం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి) : ట్రాఫిక్ పోలీసులు తూతూ మంత్రంగా విధులు నిర్వహించడంతో టిప్పర్ లారీలు, భారీ వాహనాలు ఇష్టారాజ్యంగా ఏలూరు నగరంలోకి ప్రవేశిస్తున్నాయి.ఎవరైనా ఏ మెడికల్ షాపు దగ్గరో, అత్యవసర పరిస్థితుల్లో షాపుల వద్ద బండి ఆపితే హడావిడి చేసే పోలీసులు భారీ వాహనాలు తమకు కనపడటం లేదన్నట్టు విధులు నిర్వహించడంపై విమర్శలు వెల్లివెత్తుతున్నాయి. జిల్లా కేంద్రమైన ఏలూరు నగరంలోనే ట్రాఫిక్ పోలీసుల పనితీరు ఇలా ఉంటే మిగిలిన ప్రాంతాల్లో ఎలా విధులు నిర్వహిస్తారో ఉన్నతాధికారులే తేల్చాల్సి ఉంది.

ఇవీ నిబంధనలు..

నగరంలో ట్రాఫిక్ నిబంధనల ప్రకారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు నగరంలోకి భారీ వాహనాలు, ట్రాక్టర్లకు, లోడు వాహనాలకు ప్రవేశం లేదు. దిగుమతులు, ఎగుమతులు కూడా చేయకూడదు. కానీ ట్రిప్పర్ లారీలు మట్టితో 24 గంటలు నగరం నడిబొడ్డు ఫైర్ స్టేషన్ మీదుగా వెళ్తున్నా ట్రాఫిక్ బీట్‌లో ఉన్నో పోలీసులు తమకేమీ తెలియదన్నట్టు వ్యవహరిస్తూ వాహనాల రాకపోకలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేస్తున్నారు. ఎవరైనా ఫోటోలు తీసి అధికారులకు పంపిస్తారేమోనని భావించారో ఏమో కాని ఏకంగా వాటికి నెంబర్లు తీసి వేసి వాహనాలను తిప్పుతున్నారంటే ట్రిప్పర్ల నిర్వాహకులు ఎంతకు తెగించారో ఉన్నతాధికారులు తేల్చాల్సి ఉంది. నగరంలో భారీ వాహనాలు, ట్రిప్పర్లు రాకపోకల వలన ఎంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. ఇప్ప టికైనా ఉన్నతాధికారులు తక్షణం స్పందించి చర్యలు తీసు కుని భారీ వాహనాల రాకపోకలను నియంత్రించాల్సి ఉంది.

పంట ఎండిపోతోంది.. నీరందించండి

మంత్రి నిమ్మలను కలిసిన రైతు నాయకులు



మంత్రి నిమ్మలకు సమస్య చెబుతున్న రాంబాబు

దెందులూరు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి) : దెందులూరు మండలంలోని శివారు రైతులకు పూర్తి స్థాయిలో సాగునీరు అందడం లేదని ఆదివారం పాలకొల్లులోని జలవనరుల శాఖ మంత్రి కార్యాలయంలో నిమ్మల రామానాయుడును కలిశారు. మండలానికి చెందిన మల్కాపురం సాగునీటి వినియోగదారుల సంఘం అధ్యక్షులు (గోదావరి కాల్వ) డీసీ చైర్మన్ వెలమాటి రాంబాబు, పోతునూరు సాగునీటి వినియోగదారుల సంఘం అధ్యక్షులు చలసాని రాంబాబుతో పాటు పలు నీటి సంఘం అధ్యక్షుల బృందం మంత్రిని కలిశారు. పాలగూడెం, కొవ్వలి, ఉండ్రాజవరం, దెందులూరు, సత్యనారాయణపురం, పోతునూరు, గుండుగోలను గ్రామాల పరిధిలో సాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని, గోదావరికాల్వ పరిధిలోని తమకు పూర్తి స్థాయిలో నీరందడం లేదని రైతులు మంత్రి దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. దీంతో స్పందించిన మంత్రి నిమ్మల రామానాయుడు ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి, జలవనరుల శాఖ ఎస్ఈ నాగార్జునరావుతో ఫోన్‌లో మాట్లాడి రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. అవసరమైతే గోదావరి కాల్వలో నీటి వేగాన్ని పెంచి మరి కొన్ని రోజులు రైతులకు సాగునీరు అందించాలని తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో సత్యనారాయణపురం నీటి సంఘం అధ్యక్షులు పర్వతనేని రంగారావు, టీడీపీ నాయకులు కసుకుర్తి రామకృష్ణ, వడ్లపట్ల బాచి, మాజీ సర్పంచ్ లుకలాపు సత్యనారాయణ ఉన్నారు.

రాజశేఖరం గెలుపునకు సహకరించండి

ఓటర్లను కోరిన కూటమి నాయకులు

ఏలూరు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి) : గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంను గెలిపించాలని కోరుతూ జంగారెడ్డిగూడెం పట్టణంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం ఆదివారం కూటమి నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ ప్రచారంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు రావూరి కృష్ణ, టీడీపీ సీనియర్ నాయకుడు మండవ లక్ష్మణరావు, పట్టణ బీజేపీ అధ్యక్షుడు కొప్పాక శ్రీనివాసరావు, జనసేన రాజీ, గుళ్ళపూడి శ్రీదేవి, చేను ప్రసాద్, మారిశెట్టి బాల చిట్టెమ్మ, మారిశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు టూటౌన్ : ఉపాధ్యాయులు, పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంను గెలిపించాలని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 98-డీఎస్సీ సెలక్టెడ్ టీచర్ల అసోసియేషన్ నాయకులు ఎమ్మెల్యే చంటిని కలిశారు. తమసమస్యలు పరిష్కరించాలంటూ ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చంటి మాట్లాడుతూ పేరాబత్తుల రాజశేఖరంను గెలిపిస్తే టీచర్ల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తారని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి స్వామిదాస్, కోశాధికారి సీహెచ్ శ్రీనివాసరావు, సంతోష్, అంజిబాబు, కరుణానిధి, ఏసుపాదం, కిషోర్‌బాబు, సయ్యద్ బాజీ, తదితరులు పాల్గొన్నారు.

కామవరపుకోట : కామవరపుకోట మండలంలోని గ్రామాల్లో కూటమి నాయకులు కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంను భారీ మెజార్టీతో గెలిపించాలని విస్తృత ప్రచారం నిర్వహించారు. బ్యాలెట్ పత్రాలను పట్టభద్రులకు అందచేసి కూటమిని గెలిపించాల్సిన ఆవశ్యకతను మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ రామకృష్ణ వివరించారు. ఈ కార్యక్రమంలో గుంటుపల్లి సర్పంచ్ గోరింక దాసు, కూటమి నాయకులు బాలవర్తి రాజు, షేక్ వల్లీ, బేతిన వెంకట్రావు, కంఠమనేని అంజిమూర్తి, కిలారు సత్యనారాయణ పాల్గొన్నారు.

చింతలపూడి : ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖరంను భారీ మెజార్టీతో గెలిపించాలని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ కోరారు.స్థానిక ఆర్.కె. ఫంక్షన్ హాలులో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ గత వైసీపీ పాలన వలన రాష్ట్రం అభివృద్ధి 20 ఏళ్ల వెనక్కి వెళ్ళిందన్నారు. ప్రభుత్వ వైఫల్యాల నుంచి రాష్ట్రాన్ని గాడిలో పెట్టే దిశగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు కష్టపడి పనిచేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్, మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ, రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి చంద్రశేఖ, పారేపల్లి రామారావు, మేకా ఈశ్వరయ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ పుట్టా

రాజ్యాంగంపై వ్యాస రచన పోటీలు

ఏలూరు టూటౌన్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగం సాధించిన ప్రగతి, బహుజన వారియర్స్ జీవిత చరిత్రలు డాక్టర్ బీఆర్.అంబేద్కర్ రచనలు, ప్రసంగాలనే అంశాలపై మే 10న గుంటూరు నగరంలో విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహిస్తున్నట్లు పరిక్షల నిర్వహణ జిల్లా కోఆర్డినేటర్ ఎన్.అజయ్ బాబు తెలిపారు. ఏసీఎఫ్ జిల్లా కార్యాలయంలో పరీక్షా కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అజయ్ బాబు మాట్లాడుతూ ఈ పోటీల్లో గెలుపొందిన వారికి ప్రథమ బహుమతిగా రూ.లక్ష, ద్వితీయ బహుమతి రూ.75 వేలు, తృతీయ బహుమతి రూ.50 వేలు నాల్గవ బహుమతి రూ.25 వేలు అందజేస్తామన్నారు. మే 10న పరిక్ష జరుగుతుందన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 30లోపు వెబ్ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు.ఇతర వివరాలకు 70326 86204ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఎం.అశోక్, ప్రతాప్, రంగారావు, తదితరులు పాల్గొన్నారు.



కరపత్రం ఆవిష్కరిస్తున్న అజయ్ బాబు

సోషల్ మీడియాలో పోస్టులపై కేసు

ఏలూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : సోషల్ మీడియాలో ఫేక్ ఐడీ సృష్టించి అసభ్యకరమైన మెసేజ్‌లు పోస్ట్ చేసిన శివంగి జశ్వంత్‌పై కేసు నమోదైంది. తనపై అసభ్యకరంగా ఫొటోలు పెడుతున్నారని ఆదివారం జంగారెడ్డిగూడేనికి చెందిన మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు శివంగి జశ్వంత్‌పై కేసు నమోదు చేసినట్టు ఎస్సై ఎస్.కె. జబీర్ తెలిపారు.

నేడు, రేపు విధుల బహిష్కరణ

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి) : అడ్వకేట్ అమెండ్మెంట్ బిల్లును వ్యతిరేకిస్తూ ఏలూరు బార్ అసోసియేషన్ న్యాయవాదులు సోమ, మంగళవారాల్లో కోర్టు విధులను బహిష్కరించనున్నారు. ఈ మేరకు ఏలూరు బార్ అసోసియేషన్ కార్యవర్గం ఆదివారం రాత్రి ఓ తీర్మానం చేసింది. న్యాయవాదులకు తీరని నష్టం కలిగించే విధంగా అమెండ్మెంట్ బిల్లును ప్రభుత్వం ప్రవేశపెడుతోందన్నారు. దీనిని నిరసిస్తూ ఈ ఆందోళన తెలియజేస్తున్నట్టు తెలిపారు. ఈ మేరకు ఏలూరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు కోనే సీతారామారావు(సీతారాం) న్యాయవాదులంతా కలిసి రావాలని కోరారు.

'లయన్స్ సేవలు వెలకట్టలేనివి'

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి) : లయన్స్ జిల్లా రీజియన్ సమావేశం చైర్ పర్సన్ జి.రత్నకుమారి అధ్యక్షతన ఆదివారం చొదిమెళ్ళలోని బాలాజీ గార్డెన్స్‌లో జరిగింది. ఈ సందర్భంగా రత్నకుమారి మాట్లాడుతూ పేదల అభ్యున్నతికి లయన్స్ సంస్థ అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని అన్నారు.జిల్లా గవర్నర్ కాకరాల వేణు బాబు, మాజీ గవర్నర్ బాలకృష్ణ మాట్లాడుతూ సమాజానికి ఉపయోగపడేలా లయన్స్ సంస్థ వినూత్న సేవలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అనంతరం వివిధ సేవా కార్యక్రమాల్లో ఉత్తమ సేవలందించిన వారికి అవార్డులు అందజేశారు. ప్రథమ వైస్ గవర్నర్ పాపారావు నాయుడు, డాక్టర్ డి.సుబ్బారావు, జి.మాణిక్యాలరావు, కె.వి.కిశోర్‌కుమార్, వేమా కోటేశ్వరరావు, ఎల్.వెంకటేశ్వరరావు, సిహెచ్ అవినాష్ పాల్గొన్నారు.



రత్నకుమారి దంపతులను సన్మానిస్తున్న దృశ్యం



జెస్సీ రాజ్‌ను అభినందిస్తున్న ఎంపీ పుట్టా మహేష్

జెస్సీరాజ్‌కు ఎంపీ పుట్టా అభినందన

దెందులూరు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ స్కేటర్ క్రీడాకారిణి మాత్రపు జెస్సీరాజ్‌ను ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ యాదవ్ అభినందించారు. ఆదివారం ఏలూరులోని ఎంపీ కార్యాలయంలో జోగన్న పాలెం గ్రామానికి చెందిన మాత్రపు సురేష్, రాధ దంపతుల కుమార్తె జెస్సీరాజ్ ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ (2025) అవార్డు అందుకోవడంతో ఎంపీ అభినందించారు. జెస్సీరాజ్‌కు శిక్షణనిచ్చిన కోచ్ సింహాద్రిని సైతం ఎంపీ అభినందించారు.

పామాయిల్ రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

రైతులకు హామీ ఇచ్చిన ఎంపీ పుట్టా

పెదవేగి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి) : పామాయిల్ రైతుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ హామీ ఇచ్చారు. ఏలూరులోని క్యాంపు కార్యాలయంలో ఎంపీని ఆదివారం కలిసిన పామాయిల్ రైతులు సమస్యలతో కూడిన వినతిపత్రం అందించారు. పెదవేగి పామాయిల్ ఫ్యాక్టరీలో గ్రేడింగ్ పేరుతో గెలలను ఏరివేస్తున్నారని, దీంతో నష్టాలను చవి చూస్తున్నామని, ఈ విధానాన్ని నిలుపుదల చేయించాలని రైతులు ఎంపీకి విన్నవించారు. నూనె దిగుబడి శాతం రావడంలేదని సాకుతో గెలల ఏరివేతను ఇష్టానుసారంగా చేస్తున్నారని రైతులు తెలిపారు. నూనె దిగుబడి శాతం తగ్గడానికి ఫ్యాక్టరీలోని యంత్రాలు పాతబడి పోవడం కారణమని, గెలల ఏరివేత రైతులను ఆర్థికంగా నష్టపరుస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. నూనె దిగుబడి శాతం అధిగమించడానికి అనువుగా కొత్త ఫ్యాక్టరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలని విజ్ఞప్తి చేశారు. నాణ్యత పేరుతో గెలల ఏరివేతను నిలుపుదల చేయించాలన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మహేష్ కుమార్ మాట్లాడుతూ ఆయిల్ పామ్ గెలల ధర పెరగడానికి దిగుమతి సుంకం విధించడం ఒక కారణమని, తాను చేసిన కృషి ఫలితమే రైతులకు గిట్టుబాటుధర వస్తుందని ఆయన చెప్పారు. ఆధునిక యంత్ర పరికరాలతో కొత్త ఫ్యాక్టరీ నిర్మాణానికి తనవంతు కృషిని అందిస్తానని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ రైతులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రైతులు బొబ్బా వీరరాఘవరావు, వంకినేని రంగారావు, జి.ప్రసాద్, ఉండవల్లి వెంకటరావు, ఆచంట సూర్యనారాయణ, పెన్మెత్స రామరాజు, ఏపీ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



స్వామి వారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఈవో మూర్తి

శ్రీవారి సేవలో కమిషనర్ కృష్ణతేజ

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి) : శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయాన్ని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ ఎం.కృష్ణతేజ కుటుంబ సమేతంగా సందర్శించారు. ఆలయానికి వచ్చిన ఆయనకు ఈఓ ఎన్వీ సత్యనారాయణమూర్తి, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో స్వామివారి శేషవస్త్రాన్ని కప్పి వేదాశీర్వచనం పలికారు. ఈఓ మూర్తి ఆయనకు స్వామి వారి చిత్రపటాన్ని ప్రసాదాలను అందజేశారు. ఆయన వెంట ఎంపీడీవో పి.వి.వి.ప్రకాష్ ఉన్నారు.

మా ప్రాణాలకు ప్రమాదం!

ఇంటిపై ఉన్న హైటెన్షన్ వైర్లతో బెంబేలు

ఏలూరు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి) : జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెంలోని చక్రదేవరపల్లి రహదారిలో నివసిస్తున్న నాయుడు వీరభద్రరావు ఇంటి పిట్ట గోడపై నుంచి హైటెన్షన్ విద్యుత్ తీగలు వెళ్లడంతో భయాందోళన చెందుతున్నారు. గత ఎనిమిదేళ్లుగా మేడపైకి వెళ్లాలంటే ప్రాణ భయంతో వణికిపోతున్నామని వృద్ధుడు వాపోతున్నాడు. ఇటీవలె మేడపైకి వెళ్లిన మేక, ఒక కుక్క విద్యుత్ షాక్‌కు గురై చనిపోయినట్టు తెలిపారు. విద్యుత్ తీగలు మారుస్తానని లైన్‌మ్యాన్‌గా పనిచేసే ఓ వ్యక్తి తన వద్ద ఏడు వేల రూపాయలు తీసుకున్నాడని, బదిలీపై వేరే గ్రామానికి వెళ్లిపోవడంతో ఏం చేయాలో పాలుపోవడం లేదని వృద్ధుడు వీరభద్రరావు వాపోతున్నారు. విద్యుత్ సిబ్బందికి, ప్రజా ప్రతినిధులకు మొరపెట్టుకున్నా ఫలితం లేకుండాపోయిందని అన్నారు.ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి తమ ఇంటికి పైన పిట్ట గోడకు ఆనుకుని ఉన్న విద్యుత్ తీగలను తొలగించి తమ ప్రాణాలను కాపాడాలని కోరుకుంటున్నారు.



విద్యుత్ వైర్లు చూపుతున్న వృద్ధుడు



లక్ష్మీనృసింహస్వామి అలంకారంలో ధన్వంతరి వైద్య భగవానుడు

లక్ష్మీ నరసింహ స్వామి అలంకారంలో ధన్వంతరి

ఏలూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పవరుపేట స్టేషన్ రోడ్డులోని శ్రీ ధన్వంతరి వైద్య భగవానుని ఆలయం వద్ద ఆదివారం మాఘమాసంలోని ఆఖరి ఆదివారం కావడంతో స్వామిని లక్ష్మీ నరసింహ స్వామిగా అలంకరించారు. ఆలయ అర్చకులు రాళ్లబండ ఆదిశర్మ భక్తులతో గోత్రనామాలతో పూజలు చేయించారు. వనమూలికల తీర్థాన్ని భక్తులు స్వీకరించారు. ఆలయ ప్రదక్షిణ నిర్వహించి అర్చకుల ద్వారా రక్షాబంధనాలు కట్టించుకున్నారు. ఈ మేరకు ఆలయం వద్ద భజనలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ కోరాడ రెడ్డి, ఈవో నెప్రహా ఏర్పాట్లు చేశారు.

సాయం అందజేస్తాం : మానవత

ఉంగుటూరు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి) : క్యాన్సర్‌తో బాధపడుతున్న నారాయణపురం గ్రామానికి చెందిన మోహన్ సాత్వికకి సాయం చేయాలని ఉంగుటూరు మండల మానవత సమావేశంలో నిర్ణయించినట్టు రీజియన్ చైర్మన్ పుప్పాల గోపి వివరించారు. ఆదివారం నారాయణపురంలో వేగేశ్న సూర్యనారాయణ రాజు ఇంటి వద్ద మండల మానవత సమావేశం ఉపాధ్యక్షులు కోనే వీర వెంకట సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. ఇందులో భాగంగా మండల మానవత కన్వీనర్ అడపా శ్రీనివాసరావు, కార్యదర్శి గంజి రవి, కొండ్రెడ్డి సర్వేశ్వరరావు, పుసులూరి ప్రకాష్, రామిరెడ్డి వెంకట రెడ్డి, పాతూరి వంశీ కృష్ణ పాల్గొన్నారు.

జనసేన పార్టీలో చేరికలు

ఉంగుటూరు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి) : పవన్ కల్యాణ్ ఆశయాలకు అనుగుణంగా కార్యకర్తలు పని చేయాలని ఎమ్మెల్యే ధర్మరాజు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక క్యాంపు కార్యాలయంలో నిడమర్రు మండలం దేవర గోపవరం గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు కేశన శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ కందులపాటి మహేష్ కుమార్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు జనసేన పార్టీలో చేరారు. వీరందరినీ పార్టీ జెండా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో జనసేన కార్యకర్తలు, వీర మహిళలు, జన సైనికులు పాల్గొన్నారు.

శ్రీవారి క్షేత్రంలో శానిటేషన్

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ద్వారకాతిరుమలలో ఆదివారం స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌ను మండల అధికారులు సిబ్బంది నిర్వహించారు. మన ఆరోగ్యం మన పర్యావరణ పరిరక్షణ ధ్యేయంగా గ్రామంలో ఇంటింటా చెత్త సేకరణ రోజు విడిచి రోజు జరుగుతోందని ఈవో పీఆర్డీ ఏవీ సుబ్బరాయన్ తెలిపారు. ఈక్రమంలో ఆయన ఆదివారం దగ్గరుండి డోర్ టు డోర్ చెత్త కలెక్షన్ చేయిస్తూ పారిశుద్ధ్యం, తడి, పొడి చెత్తల నిర్వహణపై ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే పండ్ల దుకాణాలు, హోటల్స్, షాపుల వద్దనున్న చెత్తను సిబ్బందితో ఎత్తించారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి జీటీవీ శ్రీనివాస్, మహిళా పోలీస్ లక్ష్మీసృజన పాల్గొన్నారు.

నేడు ఆత్మీయ సమావేశం

బుట్టాయగూడెం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను పురస్కరించుకుని ఈ నెల 27న కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంను గెలిపించాలంటూ బుట్టాయగూడెం క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆత్మీయ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్టు ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు తెలిపారు. సమావేశానికి ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, ఎమ్మెల్సీ పరిశీలకుడు పుచ్చ విజయకుమార్, నియోజకవర్గ పరిశీలకుడు అనపర్తి వెంకట నారాయణ పాల్గొంటారని తెలిపారు.

విజ్ఞానాన్ని పెంచుకోండి

పెదవేగి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి) : గ్రంథాలయాన్ని వినియోగించుకుని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని పెదవేగి శాఖా గ్రంథాలయ గ్రంథపాలకుడు తోట అరుణ్ కుమార్ పేర్కొన్నారు. పెదవేగిలోని శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. పలువురు విద్యార్థుల చేత గ్రంథ పఠనం చేయించారు.

కోడి పందేల నిర్వాహకుల అరెస్ట్

పెదపాడు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : అప్పనవీడులో కోడిపందాలు జరుగుతున్నాయనే సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి చేసి ఐదుగురిని అరెస్ట్ చేసినట్టు పెదపాడు ఎస్సై కట్టా శారద సతీష్ తెలిపారు. వారి నుంచి రూ.3,200 నగదు, రెండు కోడి పుంజులను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

కైకరంలో అన్న సమారాధన

ఉంగుటూరు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కైకరంలో ఉన్న తూర్పు వీధి చిన కంబాలమ్మ వారి 11వ ఆలయ వార్షికోత్సవం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు.

సహజ కవి బెనర్జీకి సన్మానం

కైకలూరు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): కైకలూరుకు చెందిన సహజకవి దండే బెనర్జీని ఘనంగా సన్మానించారు. ఆదివారం తెలంగాణ రాష్ట్రంలోని భద్రాచలంలోని డాక్టర్ పాల్‌రాజ్ ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియంలో శ్రీశ్రీ కళావేదిక 144వ జాతీయ శతాధిక కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ కవిసమ్మేళనంలో కైకలూరుకు చెందిన దండే బెనర్జీ పాల్గొని మహిళలు-మహారాణులు అనే కవిత గానం చేశారు. ఇది ఎంతో విశేషంగా ఆకట్టుకోవడంతో కళావేదిక అంతర్జాతీయ సీఈవో డాక్టర్ కత్తిమండ ప్రతాప్ సన్మానించారు.

ఘనంగా సీఎస్ఐ చర్చి రజతోత్సవం

ఆగిరిపల్లి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి):ఆగిరిపల్లి గ్రామం విజయవాడ రోడ్‌లోని పరిశుద్ధ జాన్ సీఎస్ఐ చర్చి నిర్మించి, 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆదివారం రజతోత్సవాలు ఘనంగా నిర్వహించారు. సీఎస్ఐ కృష్ణ - గోదావరి అధ్యక్ష ఖండం రెవ.డా.టి జార్జి కోర్నేలియాస్, రెవ.డా.జాషువా కుమారి ముఖ్య అతిథులుగా పాల్గొని ఆలయంలో ప్రత్యేక ప్రార్థనలు, ఆరాధన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద అన్నదానం నిర్వహించారు.

కొల్లేటి పెద్దింటి అమ్మవారి జాతరకు ఏర్పాట్లు



కైకలూరు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): కొల్లేటికోట పెద్దింటి అమ్మవారి జాతరకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. మార్చి నెల 1వ తేదీ నుంచి 13 వరకు ఉత్సవాలను అత్యంత వైభవోపేతంగా నిర్వహిస్తారు. 10వ తేదీన శ్రీజలదుర్గాదేవీ, శ్రీగోకర్ణేశ్వరస్వామికి కల్యాణమహోత్సవాన్ని నిర్వహిస్తారు. భక్తులు పాలపొంగళ్ళను పొంగించుకునేందుకు చలువ పందిళ్ళను ఏర్పాటు చేశారు. అలాగే విశ్రాంతి తీసుకునేందుకు ఆలయం చుట్టూ చలువ పందిళ్లను ఏర్పాటు చేసి తోరణాలతో డెకరేషన్ చేస్తున్నారు. ఇప్పటికే ఆలయానికి రంగులు వేసి సుందరవందంగా తీర్చిదిద్దుతున్నారు.

అమ్మవారికి భక్తుల తాకిడి

కొల్లేటికోట పెద్దింటి అమ్మవారిని ఆదివారం భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి దర్శించుకున్నారు. ఆలయ ఆవరణ భక్తులతో కిటకిటలాడింది. అనేకమంది మహిళలు అమ్మవారికి పాలపొంగళ్లను నైవేద్యంగా సమర్పించి మొక్కుబడులను చెల్లించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి కూచిపూడి శ్రీనివాస్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రేపటి నుంచి శివరాత్రి ఉత్సవాలు



పెదగొన్నూరులోని మల్లేశ్వరస్వామి ఆలయం

ముదినేపల్లి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): పెదగొన్నూరులోని భ్రమరాంభ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల 25 నుంచి శివరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ ఆలయం ఆవరణలో 400 సంవత్సరాల నాటి జమ్మి, రావి చెట్లు భక్తుల పూజలందుకుంటున్నాయి. 25న స్వామి, అమ్మవారిని పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెను చేయుట, 26న అభిషేకాలు, రాత్రి స్వామివార్ల కళ్యాణం, 27న గ్రామోత్సవం, రాత్రి పవళింపు సేవ కార్యక్రమాలు జరుగుతాయి. గురజ గ్రామంలో గంగాపార్వతీ సమేత శ్రీరామలింగేశ్వరస్వామి దేవస్థానంలో 25 నుంచి 27 వరకు ఉత్సవ కార్యక్రమాలు జరుగుతాయి.

భోగేశ్వరస్వామి కల్యాణోత్సవాలు

కలిదిండి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): శివరాత్రి నేపథ్యంలో భోగేశ్వరస్వామి కల్యాణోత్సవాలకు విచ్చేసే భక్తులకు పటిష్ఠమైన క్యూలైన్లు ఏర్పాటు చేయాలని కైకలూరు రూరల్ సీఐ రవికుమార్ అన్నారు. కలిదిండి పాతాళ భోగేశ్వరస్వామి కళ్యాణోత్సవాల ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్దిష్టమైన ప్రదేశాల్లో ప్రభలు ఉండే విధంగా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలన్నారు. డ్రోన్ సీసీ కె మెరాల పర్యవేక్షణతో ట్రాఫిక్ నియంత్రణకు పటిష్ఠమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వి.వెంకటేశ్వరరావు, ఆలయ ఈవో శేఖర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బలివే ఉత్సవాలకు శరవేగంగా ఏర్పాట్లు



స్వామివారి దర్శనానికి ఏర్పాటు చేసిన బారికేట్లు

ముసునూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): బలివే రామలింగేశ్వరస్వామి మహాశివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. ఇప్పటికే ఆలయానికి రంగులు, స్వామివారి దర్శనానికి బారికేట్లు, ఆలయంలో గుజరాతీ పందిళ్లు, తాత్కాలిక మరుగుదొడ్లు, మహిళలకు బట్టలు మార్చుకునేందుకు ప్రత్యేక గదులు తదితర ఏర్పాట్లు పూర్తయ్యాయి. జల్లుల స్నానాల ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఉత్సవాలకు రెండురోజులు ముందుగానే తమ్మిలేరు జలాలు బలివే చేరుకున్నాయి. భక్తుల పుణ్యస్నానాలకు పుష్కలంగా నీరు చేరింది. నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్ పర్యవేక్షణలో వివిధ శాఖల అధ్వర్యంలో ఉత్సవాల ఏర్పాట్లు వేగంగా జరుగుతున్నాయి.

రామాలయ నిర్మాణానికి రూ.50,777 విరాళం



విరాళం అందజేస్తున్న సుబ్రహ్మణ్యం, ఆంజనేయులు

కలిదిండి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): కోరుకొల్లు యాదవపాలెంలో నూతన రామాలయం నిర్మాణానికి నున్న దశరథ రామయ్య - సోవమ్మ దంపతుల జ్ఞాపకార్థం ఆంజనేయులు, సుబ్రహ్మణ్యం దంపతులు రూ.50,777లు విరాళంగా అందించారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి):రాజీవ్‌గాంధీ యూనివర్శిటీ ఆఫ్ నాలెడ్జ్‌అండ్ టెక్నాలజీ పరిధిలో గల నూజివీడు ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లో ఉచిత మెగా వైద్యశిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. నూజివీడు ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్, ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ ఎస్.అమరేంద్రకుమార్ ఈ మెగా వైద్యశిబిరాన్ని ప్రారంభించగా, శ్రీకర హాస్పిటల్స్ ఆధ్వర్యంలో గుండె, గ్యాస్ట్రిక్, లివర్, గైనకాలజీ విభాగాల్లో ట్రిపుల్‌ఐటీలోని విద్యార్థినీ విద్యార్థులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను అందించారు. శ్రీకర హాస్పిటల్స్ వైద్యులు వంశీవర్ధన్, సోమకృష్ణ, అర్చన, ఇంద్రమోహన్, కె.దివ్య, ట్రిపుల్‌ఐటీ ఏవో లక్ష్మణ్ పాల్గొన్నారు.

రహదారి పక్కన పిచ్చి మొక్కల తొలగింపు



నూజివీడు టౌన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): నూజివీడు మండలం తుక్కులూరు, జంగంగూడెం ప్రధాన రహదారికి ఇరువైపుల పిచ్చిమొక్కల తొలగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ తెలుగుదేశంపార్టీ నాయకులు వల్లభనేని భాస్కర్, వల్లభనేని రాజాల సహకారంతో జేసీబీతో రహదారికి ఇరువైపులా ఉన్న పిచ్చిమొక్కలను తొలగించారు.

పెద్దల సంరక్షణ బాధ్యత వారసులదే



వృద్ధులతో మాట్లాడుతున్న జడ్జి నాగశైలజ

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి):పెద్దల నుంచి వచ్చే ఆస్తులు మాత్రం తీసుకుంటాం. పెద్దల సంరక్షణ బాధ్యత మాత్రం మాదికాదు అనేలా వ్యవహరిస్తే సంబంధిత వారసులు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని 15వ అదనపు జిల్లా జడ్జి ఎ.నాగశైలజ అన్నారు. నూజివీడు మండలం తుక్కులూరు జేబీఎల్ వృద్ధాశ్రమాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా వృద్ధులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబాలతో విడిపోయి వృద్ధాశ్రమాలకు చేరటంలో నెలకొన్న పరిస్థితులను ప్రతి ఒక్కర్ని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు గోపీనాథ్, ఎం.రవికాంత్, తిరువీధి కృష్ణ, పారాలీగల్ వలంటీర్లు వేణుగోపాల్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

డ్రాయింగ్, పెయింటింగ్ విజేతలకు బహుమతులు

ఆగిరిపల్లి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి):ఆగిరిపల్లి మండలం చొప్పరమెట్ల గ్రామంలోని హ్యాపీ వ్యాలీ స్కూల్‌లో డ్రాయింగ్ అండ్ పెయింటింగ్ పోటీలు ఛైర్మన్ డాక్టర్ కె. కోటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 400మంది విద్యార్థులు పాల్గొన్నారు. సీనియర్ విభాగంలో మొదటి బహుమతి గుడివాడ గౌతమ్ స్కూల్ బి.దిరాజ్ బాలాజీ రూ.10వేలు, రెండో బహుమతి విజయవాడ శ్రీ చైతన్య పి.సాహితి రూ.7,500, మూడో బహుమతి హోలీ క్రాస్ స్కూల్ వి.రచన శ్రీతేజ రూ.5వేలు గెల్చుకున్నారు. జూనియర్ విభాగంలో మొదటి బహుమతి ఐకాస్ పబ్లిక్‌స్కూల్ విజయవాడ శ్రీహస్ రూ.10వేలు, రెండో బహుమతి వి.పి.ఎస్ పబ్లిక్‌స్కూల్ విజయవాడ ఎస్.సుతార్ రూ.7,500, మూడో బహుమతి డి.ఏ.వి పబ్లిక్ స్కూల్, ఇబ్రహీమ్‌పట్నం యస్.కె సధియా రూ.5వేలు గెల్చుకున్నారు. సీనియర్, జూనియర్ విభాగాల్లో ప్రోత్సాహక బహుమతులు రూ.2,500 చొప్పున ఇరవై మందికి అందచేశారు.

రహదారి అభివృద్ధి పనులు షురూ!

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నూజివీడు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): అక్షరం అండగా పరిష్కారం ఎజెండాగా ఆంధ్రజ్యోతి నిర్వహించిన సదస్సులో నూజివీడు వాసులు లేవనెత్తిన సమస్యల పరిష్కారం దిశగా అడుగులు పడుతున్నాయి. ఇప్పటికే పలు సమస్యలకు అధికారులు పరిష్కారం చూపగా, నూజివీడు పెద్దగాంధీబొమ్మ సెంటర్ నుంచి పెద్దచెరువు కళంగివద్దకు వెళ్ళే రహదారి అధ్వానంగా తయారైన విషయాన్ని పలువురు సదస్సులో ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో రహదారిని సీసీరోడ్డుగా అభివృద్ధి పరుస్తూ చర్యలు చేపట్టాలని, రాష్ట్రమంత్రి, స్థానిక శాసనసభ్యులు కొలుసు పార్థసారథి ఆదేశాలు జారీ చేయడంతో సీసీరహదారి అభివృద్ధి పనులను చేపట్టారు. ఈ క్రమంలో తిరువూరు రోడ్డులో గల బైపాస్ నుంచి ట్రాఫిక్‌ను మళ్ళించి అభివృద్ధి పనులను శరవేగంగా పూర్తి చేస్తున్నారు.



పెద్దగాంధీబొమ్మ తిరువూరు రోడ్డును సీసీరోడ్డుగా అభివృద్ధి పరుస్తున్న దృశ్యం

ఎస్సీ బాలుర వసతి గృహానికి నిధులు

త్వరలో అభివృద్ధి పనులు



ముదినేపల్లిలోని ఎస్సీ బాలుర వసతిగృహ భవనం

ముదినేపల్లి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లిలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ కళాశాల స్థాయి బాలుర వసతిగృహానికి మంచి రోజులొచ్చాయి. ఈ వసతిగృహ భవన మరమ్మతులతోపాటు, మౌలిక సదుపాయాల కల్పనకు కూటమి ప్రభుత్వం సుమారు రూ.4.50 లక్షల నిధులు మంజూరు చేయటంతో ఏడాదిగా మూతబడిన ఈ వసతిగృహం తిరిగి తెరుచుకోనుంది. త్వరలో అభివృద్ధి పనులను ప్రారంభించనున్నట్లు హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఆర్.వి.అప్పలస్వామి తెలిపారు. ఈ వసతిగృహంలో టాయిలెట్స్‌ను వినియోగంలోకి తీసుకురావటంతోపాటు, గదుల్లో ఫ్యాన్లు ఏర్పాటు, వసతిగృహ ఆవరణను అభివృద్ధి చేస్తారు. రానున్న విద్యాసంవత్సరం నుంచి హాస్టల్‌లో విద్యార్థుల అడ్మిషన్లు ప్రారంభమవుతాయి. సుమారు 30 మంది కళాశాల విద్యార్థులకు వసతి సౌకర్యం కలుగనుంది.

ఎమ్మెల్సీ ఎన్నికలపై నేడు సమావేశం

ముదినేపల్లి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల్లో కైకలూరు నియోజకవర్గంలో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించేందుకు సోమవారం ముదినేపల్లిలో ఎన్‌డీఏ కూటమి నాయకులు, పార్టీ పరిశీలకులతో సంయుక్త సమావేశాన్ని నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్‌తోపాటు నియోజకవర్గ పార్టీ పరిశీలకులు మెంటే పార్థసారథి, సాంబిరెడ్డి, ఏపీ గౌడ సంక్షేమ కార్పొరేషన్ ఛైర్మన్ వీరంకి గురుమూర్తి, పార్టీ నాయకులు పాల్గొంటారని నియోజకవర్గ టీడీపీ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చల్లగొళ్ళ శోభనాద్రిచౌదరి తెలిపారు.



వేల్పుచర్లలో ర్యాలీ చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

సారా రహిత సమాజమే లక్ష్యం

ముసునూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): సారా రహిత సమాజం ప్రభుత్వ లక్ష్యమని ఎక్సైజ్ ఎస్ఐ ఎమస్తానయ్య అన్నారు. నవోదయ 2.0లో భాగంగా ఆదివారం వేల్పుచర్లలో ఎక్సైజ్ పోలీసులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ సారాయి, గంజాయి వంటి మత్తు పదార్థాలు సేవించడం వల్ల అనేక నష్టాలు కలుగుతాయన్నారు. బలివే ఉత్సవాల్లో ఎక్సైజ్ శాఖ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేస్తున్నామని, 24గంటలు గస్తీ ఉంటుందని, మద్యం విక్రయాలు చేస్తే కేసులు పెట్టి చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. మద్యం, సారా విక్రయాలపై 99495 39933 నెంబరుకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ఎస్ఐ తెలిపారు.



కైకలూరులో నిర్మాణం చేసిన అగ్రిల్యాబ్

లక్ష్యం ఘనం.. ఆచరణ శూన్యం

నామమాత్రంగా సేవలందిస్తున్న కైకలూరు అగ్రిల్యాబ్

కైకలూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : లక్ష్యం ఘనం.. ఆచరణ శూన్యం అన్నట్లుగా కైకలూరులోని అగ్రిల్యాబ్ పరిస్థితి మారింది. రైతులకు మెరుగైన సేవలందించేందుకు స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్ కమిటీలో గత వైసీపీ ప్రభుత్వం అగ్రిల్యాబ్‌ను కైకలూరులో రూ.66.50 లక్షలతో నిర్మాణం చేశారు. భూసార పరీక్షలు, పశుసం వర్ధకశాఖ చెందిన పరీక్షలు ఆక్వా కల్చర్ అభివృద్ధిలో భాగంగా టెస్టింగ్ ల్యాబ్‌లు ఏర్పాటు కోసం భవనం నిర్మాణం చేసి అగ్రి టెస్టింగ్ ల్యాబ్ ప్రారంభించారు. అయితే దాని నిర్వహణకు పూర్తి స్థాయిలో సిబ్బందిని నియమించకపోవడంతో అరకొర సేవలే అందుతున్నాయి. అగ్రిల్యాబ్‌లో భూసార పరీక్షలు, పంట సాగులో రైతులకు అవసరమైన సలహాలు, సూ చనలు ఇవ్వాలి. భూసార పరీక్షలు, విత్తనాల నాణ్యత, పశువుల్లో వ్యాధుల నిర్ధారణ తదితర సేవలు అందించాల్సి ఉంది. అయితే అగ్రి ల్యాబ్‌లో విత్తనపు శుద్ధి మినహా ఏ సేవలు అందుబాటులో లేవు. అందుకు కావాల్సిన పూర్తిస్థాయి సామగ్రి ఏర్పాటు చేయలేదు. కొన్ని పరికరాలను ఏర్పాటు చేసినా రసాయనాలు అందుబాటులో లేవు.

వేధిస్తున్న సిబ్బంది కొరత

అగ్రిల్యాబ్ సిబ్బందిని పూర్తిస్థాయిలో నియమించకపోవడంతో వ్యవసాయ శాఖలో పని చేసే సిబ్బందికి ఇక్కడ విధులు కేటాయిస్తున్నారు. ల్యాబ్‌కు కావాల్సిన పూర్తిస్థాయి సిబ్బందిని నియమించడంలో ఉన్నతాధికారులు విఫలమయ్యారు. కూటమి ప్రభుత్వం దృష్టి సారించి అగ్రిల్యాబ్‌ను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.

విద్యార్థిని ఆత్మహత్య



నూజివీడు టౌన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి):పెద్దలు మందలించారనే క్షణికావేశంలో విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన నూజివీడులో చోటుచేసుకున్నది. వివరాల ప్రకారం నూజివీడు పట్టణం బాపూనగర్‌కు చెందిన బి.వెంకటరమ్య(18) పెద్దలు మందలించారనే కారణంతో ఇంట్లో ఉరివేసుకుని శనివారం ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించింది. దీన్ని గమనించిన కుటుంబసభ్యులు రమ్యను నూజివీడు ఏరియాఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. నూజివీడు పట్టణ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టంకు పంపి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దైవదర్శనానికి వెళ్ళగా.. ఇంటిని దోచేశారు..

కైకలూరు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ఇంటికి తాళం వేసి దైవ దర్శనానికి వెళ్లగా తిరిగి వచ్చేసరికి 30 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. కైకలూరు టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు కైకలూరు మండలం గోపవరం గ్రామంలో ఆంజనేయస్వామి ఆలయం వద్ద నివసిస్తున్న మాగంటి కాత్యాయనీ తన ఇద్దరి కుమారులతో శనివారం సాయంత్రం ద్వారకా తిరుమల వెంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు వెళ్లారు. రాత్రి 10.30 గంటలకు ఇంటికి రాగా ఇంటి తలుపుల తాళాలు పగలగొట్టి ఉండడం గుర్తించారు. బీరువాలోని 30 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీ అయినట్లు గుర్తించి టౌన్ పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. ఎస్సై డి వెంక టకుమార్ తన సిబ్బందితో సంఘటనా స్థ లాన్ని పరిశీలించి క్లూస్ టీం ద్వారా ఆధా రాలను సేకరించారు. ఏఎస్సై మల్లికార్జున రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సస్పెన్షన్

ముదినేపల్లి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : ముదినేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జాస్మిన్ సస్పెండ్ అయ్యారు. ఈ మేరకు ఇటీవల ఇంటర్మీడియట్ బోర్డు రీజనల్ జాయింట్ డైరెక్టర్ శారద ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఏడాది జనవరి 4న ఆ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ప్రారంభోత్సవ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ఆమె ఆలస్యంగా రావడం, నిర్వహణ ను పట్టించుకోకపోవడం, ఎన్డీఏ నాయకుల పట్ల ఆమె ప్రవర్తించిన తీరుపై ఆర్జేడీకి సమాచారం పంపడంతో ఆమె కృష్ణా జిల్లా ఇంటర్మీడియట్ విద్య అధికారి సాల్మన్ రాజుతో పై అంశాలపై ఇటీవల విచారణ జరిపించారు. అప్పటికే ఆమె ఈ ఆరోపణలతో రాజమండ్రిలోని ఆర్‌జెడి కార్యాలయానికి ఎటాచ్‌మెంట్‌లో ఉన్నారు. విచారణ అధికారి అందజేసిన పూర్తి స్థాయి నివేదికను పరిశీలించిన అనంతరం ఆమెను ఆర్జేడీ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఆ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్‌గా సత్యనారాయణమూర్తి కొనసా గుతున్నారు.

పాముకాటుకు ఒకరి మృతి

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : ఒక వ్యక్తిని పాముకాటు వేయడంతో ఏలూరు ప్రభు త్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆకివీడు మండలం నందవల్లిపాడు గ్రామానికి చెందిన కొలవల సూరయ్య (55)ను ఈనెల 22వ తేదీన పాము కాటు వేయడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. అతడిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకు రాగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు.

కళ్లల్లో కారం కొట్టి బ్యాగ్ చోరీ

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : ఒక కాస్మొటిక్స్ కంపెనీకి కలెక్షన్ ఎగ్జిక్యూటివ్‌గా ఉన్న వ్యక్తి సొమ్ములను వసూలు చేసుకుని తిరిగి వెళ్తుండగా మార్గమధ్యలో గుర్తు తెలియని ఇద్దరు యువకులు ఆపి ఫోన్ అడిగి ఆపై అకస్మాత్తుగా కళ్ళల్లో కారం కొట్టి నగదు బ్యాగ్‌ను అపహరించుకు పోయారు. ఈ సంఘటన ఏలూరు నగరంలో ఈనెల 22వ తేదీ రాత్రి జరిగింది. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయ డంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిడదవోలుకు చెందిన గొట్టాల వీరేష్ (40) ఏలూరులోని ఒక హోటల్‌లో ఉంటు న్నాడు. ఒక కాస్మోటిక్స్ వస్తువుల తయారీ కంపెనీ హోల్‌సేల్ డీలర్ వద్ద కలెక్షన్ ఎగ్జిక్యూ టివ్‌గా పని చేస్తున్నాడు. వివిధ షాపుల నుంచి వారాంతపు వసూలు కోసం శనివారం ఏలూరు నగరానికి వచ్చి సొమ్ములను వసూలు చేసుకు న్నాడు. మొత్తం రెండు లక్షల 41 వేల 600 రూపాయల నగదును రాత్రి 11.30 గంటల తరువాత బ్యాగ్‌లో పెట్టుకుని వన్‌టౌన్ ప్రాంతం నుంచి టూటౌన్ ప్రాంతానికి వెళ్ళేందుకు కాంగ్రెస్ కార్యాలయం వద్ద అగ్రహారం రోడ్డులో వెళ్తున్నాడు. ఇద్దరు వ్యక్తులు మోటారు సైకిల్‌పై వచ్చి ఫోను ఇవ్వాలని ఆపారు. అతను ఆగిన వెంటనే కళ్ళల్లో కారం కొట్టి బ్యాగ్ అపహరించుకుపోయారు. అతను తేరుకుని అటుగా వెళ్ళే వారి సహకారంతో ముఖం కడుక్కుని ఆ తరువాత పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఏలూరు వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఆలపాటికి మద్దతుగా కూటమి నాయకుల ప్రచారం

ముదినేపల్లి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల్లో ఎన్‌డిఏ కూటమి అభ్యర్థి, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను గెలిపించాలని ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొడాలి వినోద్ కోరారు. ఆదివారం ఆయన టీడీపీ నాయకులతో కలసి ముదినేపల్లి, చిగురుకోట గ్రామాల్లో పట్టభద్రులను కలసి ఓట్లు అభ్యర్థించారు. తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి చలసాని జగన్మోహనరావు, తెలుగు మహిళ జిల్లా కార్యదర్శి కందేపి పద్మ తదితరులు పాల్గొన్నారు.

చాట్రాయి: ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని కోరుతూ ఆదివారం చీపురుగూడెంలో కృష్ణామిల్క్ యూనియన్ డైరెక్టర్ బొట్టు రామచంద్రరావు, గ్రామ టీడీపీ అధ్యక్షుడు తమ్మిశెట్టి లక్ష్మణరావు ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

మండవల్లి: ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని గన్నవరం నీటి సంఘం అధ్యక్షులు కూనపురెడ్డి వెంకట బాల కోటేశ్వరరావు కోరారు. పార్టీ నాయకులు గంజాల శ్రీనివాసరావు, బైలపాటి రామలింగం తదితరులు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్లను కలిసి ఓట్లు అభ్యర్థించారు.

కలిదిండి: గుంటూరు - ఉమ్మడి కృష్ణా జిల్లాల కూటమి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను గెలిపించాలని కోరుతూ కలిదిండిలో ఆదివారం కూటమి నాయకులు ప్రచారం నిర్వహించారు.



కలిదిండిలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న కూటమి నేతలు



చిగురుకోటలో ప్రచారం చేస్తున్న టూరిజం అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ వినోద్

ఇంటింటికి వెళ్లి ఓట్లను అభ్యర్థించి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ, టీడీపీ సీనియర్ నాయకురాలు నున్న రమాదేవి, నాయకులుబో యిన గోవింద్, నున్న సుబ్రహ్మణ్యం, భట్రాజు ఏసుబాబు, గొల్లయ్య, జాన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ముసునూరు: ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు తొలి ప్రాధాన్యత ఓటు వేసి, శాసనమండలికి పంపాలని టీడీపీ యువనేత గరిముక్కు నాని ఓటర్లను కోరారు. ఆదివారం వేల్పుచర్లలో నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు మానం రాంబాబు, గోసాల రామరాజు తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	90, 99, 110
చికెన్ విత్ స్కిన్	170
చికెన్ స్కిన్‌లెస్	180

నెక్ కోడి గుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ.475